C SYMROIC290

హారత్యాకశిపుడు

శ్రీ ఆమంచర్ల గోపాలరావు

(సాహితీ సమితి)

క్వాలిటీ పబ్లిషర్స్
విజయవాడ-2.

CT

SYMR01C290

హిరణ్యకశిపుడు

(నాటకం)

శ్రీ ఆమంచర్ల గోపాలరావు,
(సాహితీ సమితి)

క్వాలిటీ పబ్లిషర్స్
విజయవాడ-2

క్యాలిటీ ప్రచురణ

ద్వితీయ ముద్రణ

అక్టోబరు 66

వెల: 2-25

రాధా ప్రెస్,

విజయవాడ-2.

అంకితము :

చారువాకాది సర్వవిప్లకారులకు

ముందు మాట

మతం

మతాన్ని పండితులు అనేక రకాలుగా నిర్వచించారు. మతం మానవుడ్ని జయించింది. మతం ఆదినుంచి ఉందనే చెప్పవచ్చు. ఆది నుంచి సర్వమానవ సౌభ్రాతృత్వానికి మతం ప్రతిబంధకం అయినమాట కూడ వాస్తవం. అయితే ప్రతి మతం సర్వమానవ సౌభ్రాతృత్వాన్నే బోధించింది. కాని మతాన్ని మరోరకంగానే వాడుకోడానికి మానవుడు ఆదినుంచీ అలవాటు పడ్డాడు. మానవులలో విభిన్న విబేధాలను కల్పించడానికి, నిమ్నోన్నతములను సృష్టించడానికి, మానవులచేత అతి క్రూర హింసాకాండలను చేయించడానికి మతం ఎంతో ఆధారభూతం అయింది, ఇది చారిత్రక సత్యం.

ఆమెరికా ఖండంలో దాదాపు పదిహేను శతాబ్దాలకు పూర్వం ఒక రకమయిన మతం ఉండేది. ఆ మతంలో నరబలులు ప్రధాన పాత్రలు వహించేవి మతంపేరుతో ఆ జాతులలో మానవుడ్ని మానవుడు హత్య చేసేవాడు. దాదాపు పదిహేడవ శతాబ్దంలో ఐరోపావారు ఆ ఖండంలో అడుగుపెట్టారు. అనాటి వరకూ అవిచ్ఛిన్నంగా వర్ధిల్లుతూన్న అక్కడి మహానాగరికతను, అక్కడి సకల జాతులను ఐరోపావారు మతం పేరుతోనే హతం చేశారు. ప్రాచీన అమెరికా నాగరికతా వైభవాన్ని గురించి పలుకుటకు ఈనాడు కొన్ని శిథిల శిలలే మిగిలి ఉన్నాయి.

మధ్య ఆసియాలో మతం పేరిట మానవుడొనర్చిన క్రూర దురంతాలకు లెక్కలేదు. పూర్వం అక్కడ ప్రతివారు తమ ప్రథమ శిశువులను దేవతలకు విధిగా బలి యిచ్చేవారు. అటు తర్వాత అటువంటి అనేక దురాచారాలను రూపుమాపడానికి, స్వచ్ఛతను సూత్రంగా చేసుకొని మహమ్మదీయ మతం అవతరించింది. మహమ్మదీయ మతం తన సిద్ధాంతాలను కత్తితో ప్రచారం చేసింది

ఐరోపాలో ప్రజ్వలించి, నేడు లోకం అంతటి వ్యాపకమయిన క్రైస్తవమతం ఆసియాలోనే అంకురించింది. ఆసిన మతంపేరిట

బలీయమయిన క్రైస్తవులకు లెక్కయేలేదు. అటు తర్వాత మధ్య యుగంలో ఐరోపా కాథలిక్కులకూ, ప్రొటస్టెంటులకూ జరిగిన యుద్ధాలలో మానవుడు సలిపిన ఘోర దురంతాలకు మితిలేదు. గర్భిణుల పొట్టలు చీల్చి, పిండములను ఈటెల మొనలకుగ్రుచ్చి, ఆనాడు మతం పేరిట మానవులు పెద్ద పెద్ద ఊరేగింపులు చేశారు. మతం పేరిట మానవ చరిత్రలో జరిగిన ఘోర దురంతాంలో ఇవి కొన్ని మాత్రమే.

మనదేశ చరిత్రకూడ మతంపేరిట జరిగిన అనేక రాక్షస కృత్యములతో నిండిఉంది. వేదకాలములో యజ్ఞములలో పశువులను బలి ఇచ్చుట సామాన్యవిశేషమే. నరమేధంకూడ నాడు ఆచరణలో వున్నట్లు తార్కాణాలు కలవు హరిశ్చంద్రుడు తన ఆరోగ్యంకొరకు ఋనశ్శేపుడిని వరుణదేవునకు బలిగా ఇవ్వడానికి సిద్ధం అయినాడు. అదృష్టదేవత కలసివచ్చి, ఋనశ్శేపుడు తప్పించుకో గలిగాడు.

వైదిక మతం నీరసించిననాడు బౌద్ధ, జైన మతాలు అంకురించాయి. నాడు మన దేశంలో అనేకమతాలు వర్ధిల్లుతున్నట్లు బుద్ధుడే చెప్పాడు. కాని ఆరోజులలో ఏ నదేశంలో మాత్రం మతం పేరుతో మానవునిపై మానవుడు దండెత్తలేదు. కొంతకాలం గడచిన తర్వాత మనదేశంలో అనేక వీరమతాలు ప్రబలి పడగలెత్తాయి శైవులు, వైష్ణవులు, జైనులు మొదలయిన మతస్థులందరూ రాజులవద్ద తమకు ప్రాపకం చేకూరినపుడు, ఇతర మతస్థులను హింసించేవారు.

పదునొకండవ శతాబ్దంలో వీరశైవుల హింసలు పడలేక రామానుజాచార్యులు స్వదేశం వదలి హొయిసల రాజ్యంలో తలదాచికొనవలసి వచ్చింది. కాకతీయ చక్రవర్తులు జైనమతం వర్ధించి, శైవం చేపట్టిం తర్వాత సకలాంధ్రంలో జైనులను చితవధల పాల్జేశారు. అనేకమంది జైనులను పెద్ద పెద్ద రాతిగానుగలలోవేసి, గానుగలనాడించి అతి క్రూరంగా చంపించారు. ఈ బాధలు సహింపలేక జైననాయకులు కాకతీయుల రాజ్యం కూలద్రోయడానికి ఢిల్లీవెళ్లి, ఢిల్లీ సుల్తానులు ఆంధ్ర మీదకు దండెత్తేలాగు చేశారు.

మనదేశ చరిత్రలో ఎక్కువభాగం వేర్వేరు మతాలవారి యుద్ధాలతో నిండివుంది. విజయనగర మహాసామ్రాజ్యం సయితం మతం కారణంగానే విచ్ఛిన్నమయింది.

సంఘం మతంపేరుతో మానవుని పీడించడం మనం ఎరుగనిది కాదు. గత శతాబ్ద ప్రారంభంవరకూ, మతంపేరుతో మనవారు సహగమనాలు చేయించారు. ముక్కుపచ్చలారని పసిపిల్లలను ముసలివాండ్లకు గట్టి, ఆ ముదుసలులు మరణించగానే, మతంపేరుతో ఆ పసికూనలను ముదుసలి భర్తల శవాలతోపాటు నిలువున, సజీవంగానే మనవారు దహనం చేసెడివారు. మతం మానవునకు వెర్రి కల్పించలేక పోయినట్లయితే మనదేశ చరిత్ర, ప్రపంచ చరిత్రే మరోరూపం దాల్చి ఉండేది. ఇది ఈనాడు మనం ఎరుగగలిగిన సత్యం.

హిరణ్యకశిపుడు

బౌద్ధం అవతరించిన తర్వాత హైందవం స్వరక్షణకోసం తన రూపం మార్చుకుంది. వేదకాలంలోని యజ్ఞ ఆశయాలు, అటుతర్వాత రూపొందిన తపస్సాశయాలు అస్తమించాయి. క్రీస్తుకుపూర్వం దాదాపు మూడవశతాబ్దంలో భాగవతులమతం ఉదయించింది. ఇది భక్తిప్రాధాన్యం.

అటుతర్వాత మనదేశం అనేక మతాలకు ఆలవాలమయింది. వైష్ణవం, శైవం, గాణాపత్యం, సౌరం, శాక్తేయం, స్మార్తంమొదలయినవి కొన్నిమతాలు మాత్రమే. మతములకు సంబంధించిన అనేక ఇతిహాసముఖతో పురాణములు రూపముల నందికొన్నాయి. పురాణములందలి సర్వ ఇతిహాసములలో భావం ఒక్కటే. ఆ దేముడో లేక దేవతో మతం నమ్మినవారికి సర్వ ఐశ్వర్యాలనూ సంప్రాప్తింప జేస్తుంది. మత ప్రతిపక్షులకు హతం, వినాశం మాత్రం నిశ్చయం. హిరణ్యకశిపు వధకూడ ఇటువంటి కోవకు చెందినదే.

హిరణ్యకశిపునికథ వివిధ పురాణాలలో వివిధ రకాలుగా చెప్పబడింది. కశ్యపప్రజాపతి ఒక యజ్ఞం చేయబూనుకున్నాడట. అప్పుడు ఆయనగారి భార్య దితి గర్భంధరించి ఉంది. యజ్ఞశాలలో ఇతర ఆసన

ములతోపాటు, ఉన్నతమయిన ఒక బంగారు ఆసనంకూడ అమర్చి ఉంచారుట. దానిమీదమాత్రం ఎవరూ ఉపవిష్టులు కాలేదు. యజ్ఞసమయములో దితి కన్నదట. దితికి పుట్టిన ఆ పాపడు, పుట్టీ పుట్టగానే, గబ గబ నడచివచ్చి, ఆ హిరణ్మయ ఆసనంపై ఉపవిష్టుడయి, నాలుగు వేదాలను, అష్టాదశ పురాణములను ఏకధారగా వల్లించినాడుట. యజ్ఞానికి వచ్చిన పెద్దలంతా, ఆ దృశ్యంచూచి, ఆశ్చర్యపడి, ఆ బాలునికి హిరణ్యకశిపుడని నామకరణం చేశారుట. ఇది వాయుపురాణంలో కథ.

కూర్మపురాణంలో మరొ కథ ఉంది. హిరణ్యకశిపుడు, హిరణ్యాక్షుడు బ్రహ్మచే వరములు పొంది, దేవతలను హింసింపసాగారుట. దేవతలు విష్ణువు వద్దకువెళ్ళి మొరపెట్టుకోగా, విష్ణువు ఆ అసుర సోదరుల మీదకు గరుత్మంతుని, తన కొంత పరివారాన్ని దండుపంపాడుట. వారు విఫలులుకాగా, విష్ణువే స్వయంగా ప్రచండ సైన్యములతో హిరణ్యకశిప, హిరణ్యాక్ష సోదరులమీదకు దండెత్తినాడుట, యుద్ధం అతి తీవ్రమయిందట. హిరణ్యకశిపుని చెంతయున్న అతని తనయుడు, ప్రహ్లాదుడు ఇదంతా గమనించి, తమ శత్రువు ఆదిదేవుడని గ్రహించి, యుద్ధమునుంచి విరమించమని తన తండ్రితో ప్రాధేయపడినాడుట. తండ్రి మొండిపట్టున తనమాట విననందున, ప్రహ్లాదుడు సపరివారంగా యుద్ధ భూమినుండి తొలగి పారిపోయినాడుట విష్ణువంత పరాక్రమించి, హిరణ్యాక్ష హిరణ్యకశిపులను సంహరించాడుట.

నేడు ప్రచారంలో ఉన్న భాగవత కథను పోలినకథ. పద్మ పురాణంలో ఉంది. ప్రహ్లాదుడు పూర్వజన్మలో బ్రాహ్మణుడు. హిరణ్యకశిపుని కుమారుడయి జన్మించిన తర్వాత, పూర్వజన్మ వాసనల ననుసరించి అతడు విష్ణు భక్తుడవుతాడు. విష్ణు విరోధి అయిన హిరణ్యకశిపుడు ఇది సహింపలేడు. ప్రహ్లాదుని అనేక హింసలకు పాల్జేస్తాడు. ప్రహ్లాదుడు చలింపడు. చివరకు విసిగి, హిరణ్యకశిపుడు ప్రహ్లాదునిజూచి, "నీ దేవుడెందుకలడు? ఈ స్తంభములో కలడా?" యని ప్రశ్నిస్తాడు. ప్రహ్లాదుడు వెంటనే ఆ స్తంభాన్ని ఒక గ్రుద్దు గ్రుద్దుతాడు. స్తంభము బ్రద్ద

అయి అందుండి నృసింహావతారం వెలువడి హిరణ్యకశిపుని అతి క్రూరంగా చీల్చివేస్తుంది.

ఒకేకథ వేర్వేరు పురాణాలలో, వేర్వేరు రూపాలలో కనుపించ వచ్చు. కాని అన్నింటికీ ఒక సూత్రంమాత్రం సామాన్యమే. మతం ప్రతిపక్షులను ఇతర మతస్థులనూ ఓర్వదు. సహింపదు. అయినా ఈ నాడు సర్వమానవ సమత, సర్వమానవ సౌభ్రాతృత్వం ప్రబోధించ డానికి ప్రతి మతం ప్రయత్నిస్తూనే ఉంది.

కాని మతాన్ని అంటుకొని మానవుడు సర్వమానవ సౌభ్రాతృ త్వాన్ని సాధింపలేడని ఈమధ్యనే మనకు సువిదితమయింది. మతం పేరిట మనదేశాన్ని విభిన్నంచేసి, ఒక ఉపరాజ్యం స్థాపించి, కొందరు నాయకులు మహదధికారం పొందగలిగారు.. మతం పేరిట ఆ రాజ్య స్థాపనకాలంలో జరిగిన అత్యాచారాలకూ, క్రూరచర్యలకూ లెక్కలేదు. పసిపాపలను ఇనుపమేకులతో కొయ్యపలుపులకు బిగించారు. మనుష్య లను, స్త్రీలనూ, పురుషులనూ, బాలబాలికలనూ క్రాళ్ళతో కట్టలుగా కట్టి, నూనెపోసి నిప్పంటించి, బ్రతికుండగానే దహించారు. ఇండ్లు తగు లబెట్టి, ఇండ్లనుంచి తప్పించుక పారిపోవ ప్రయత్నించినవారిని సయి తము ఆ మంటలలోనే విసరివైచి, తగులబెట్టి చంపారు.

నేటికీ సంపూర్ణ సహజీవనానికి, సర్వమానవ సౌభ్రాతృత్వానికి మతం అటంకంగానే నిలిచి ఉంది. మత కారణంగానే అత్యవసరమగు సమైక్యతనుకూడ నేడు మనం సాధించ లేకున్నాము.

మానవ చరిత్రలో, మానవునకు మతాలు చేసిన మేలుకంటే, కీడే ఎక్కువగా కన్పిస్తుంది కాని మతం వదలి మానవు డేమి చేస్తాడు? మరో మతం నిర్మిస్తాడు. మతం వినా జీవించడానికి మానవుడింకా నేర్చుకోలేదు. ఎన్నటికైనా దీనిని మానవుడు సాధించగలడా? సర్వ మానవ సౌభ్రాతృత్వం వాఙ్మయాన్ని, మతగ్రంథాలనూ, సూక్తులనూ, ఉపన్యాసములనూ మించి, నిజమానవాంతర్యంలో స్వచ్ఛంగా ఉదయించి, ఎన్నటికయినా వికసింపగలదా?

ఆమంచర్ల గోపాలరావు.

అనంత ప్రాంతము ; గాఢాంధకారము ; నిశ్శబ్దప్రకృతి ; మంద గానము; మరల నిశ్శబ్దము.

(అంతలో ఒకపెద్ద వికటాట్టహాసము. రెండవ వైపునుండి కుపిత కంఠముతో—) ఏల యీ వికటాట్టహాసము?

ధ్వని—హిరణ్యకశిపా !

హిరణ్యకశిపుడు—ఆఁ !

ధ్వని—నీ యాలోచనకు నవ్వు.

హిరణ్యకశిపుడు—నా యాలోచ నంత హాస్యాస్పదమా?

ధ్వని—అవును.

హిరణ్యకశిపుడు—ఏల ?

ధ్వని—విప్లవమును తెత్తువా ?

హిరణ్యకశిపుడు—కాకున్న ? [మరల హాసము]

హిరణ్యకశిపుడు—[కృద్ధ గంభీర కంఠస్వరముతో] ఏమి యానవ్వు ? ధైర్యమున్న ముందునకు రమ్ము.

[ప్రవేశము : హిరణ్యకశిపుడు]

ధ్వని—విప్లవ సంకల్పమున కొండపై విరిగిన గాజుకుప్పవలె ముక్కలై ముక్క లగుదువు.

హిరణ్యకశిపుడు—[వికృత హాసము చేయును]

ధ్వని—ఏల యీ హాసము ?

హిరణ్యకశిపుడు—భయ భ్రాంతుడగు జీవి విప్లవమున కుద్యుక్తుడగునా ? నాకు భయములేదు. నా సంకల్పము నెరవేర వలయును.

ధ్వని—(వికట హాసము చేయును.)

హిరణ్యకశిపుడు—[కోపముతో] హాసమేల ?

ధ్వని—లాభమేమి?

హిరణ్యకశిపుడు—క్రాంతివలన నేర్చిన జ్ఞానము లోకమున కెంతయు నుపకారి కాగలదు. ప్రతి నరుడును స్వతంత్ర సౌఖ్యమును పొందగలడు.

ధ్వని—ఈ యుగమున అట్లు జరుగదు.

హిరణ్యకశిపుడు—పోనీ, మరియొకయుగమున కాగలదులెమ్ము.

ధ్వని—అయిన నీవు చేయు పనియేమి ?

హిరణ్యకశిపుడు—

పారతంత్ర్యమునం బలు బాములొంది
కష్టవారధి బడి దరి గానలేక
స్వేచ్ఛ నెడబాసి దైన్యత జెలగుచుండి
కారుమబ్బులు జుట్టిరా గలతవడుచు
దిక్కులన్నియు మరోత్కిగ పిక్కటిలుచు
పారు పందల నిలబెట్టి వీరవరుల
జేయు పాటను పాడెద చిత్రగతుల.
మట్టిబొమ్మల నుసురుల బట్టి నిలిపి
జీర్ణమర్త్యుల వీరుల జేసి వైతు.
కుంభకర్ణుల మేల్కొల్పి కొరవినిచ్చి
స్వార్ధ లోకంబు మండించి వరలుచుందు.
సర్వ జీవన సౌభాగ్య సరణి బ్రోచి
భ్రాంతి పోగొట్టి మాంద్యంబు పారద్రోలి
క్రాంతి గీతంబు పాడెద కంఠమెత్తి.

అజ్ఞాన గాఢాంధకారమును జ్ఞానదీపికచే పటాపంచ లొనరించివైతు. మత దాస్య శృంఖలముల బద్ధులై మూర్ఖ ప్రతిమానవునకు స్వాతంత్ర్యోదయ మొనగూర్చి హితవు నొడగూర్తును.

ధ్వని—హిరణ్యకశిపా!

హిరణ్యకశిపుడు—అఁ!

ధ్వని—నీ సోదరుడగు హిరాణ్యాక్షుని కెట్టిగతి ప్రాప్తించినది?

హిరణ్యకశిపుడు—అఖీప్సిత సంకల్పమున ప్రాణము గోల్పోయిన వాని గతి ఏమగును?

ధ్వని—దిక్తటముల వానిపేరు వెలుగొందును.

హిరణ్యకశిపుడు—నా సోదరుని గతియు నదియే.

ధ్వని—నీ కోటమి యన్న భయములేదా?

హిరణ్యకశిపుడు—ఓటమికి భీతిలువాడు ధీరుడగునా?

ధ్వని—హిరణ్యకశిపా!

హిరణ్యకశిపుడు—ఏమి?

ధ్వని—నీవు రాజ్యమును గోల్పోవుదువు.

హిరణ్యకశిపుడు—లోక హితము కొరకు స్వల్పమగు రాజ్యమును త్యజింపజాలనిచో నా జీవిత మంతయును వ్యర్థముగాదా?

ధ్వని—భార్య నీ యెడ రోతజెంది నిన్ను పరిత్యజించును! [ఒకింత నిశ్శబ్దత] హిరణ్యకశిపా!

హిరణ్యకశిపుడు—ఏమి?

ధ్వని—మాటాడవేమి?

హిరణ్యకశిపుడు—కర్తవ్యమును నెరవేర్తును.

ధ్వని—దీర్ఘముగా నాలోచించుకొనుము. నీ స్త్రీ నిన్ను త్యజించుటయే గాక నీకు పరమ విరోధిని కూడా కాగలదు.

హిరణ్యకశిపుడు—విధి నిర్వర్తింతును.

ధ్వని—పుత్రుడు నిన్ను విడనాడును.

హిరణ్యకశిపుడు—విధి నిర్వర్తింపక తప్పదు.

ధ్వని—పురోహితులు, బ్రాహ్మణులు, క్షత్రియులు, వేయేల నీ యభిమాన పాత్రమగు నీ సైన్యమే నిన్ను త్యజింపగలదు.

హిరణ్యకశిపుడు—ధర్మము నిర్వహించవలెను.

ధ్వని—నీ తమ్ముని వెన్నాడినట్లె నిన్ను ద్రోహము వెన్నాడగలదు.

హిరణ్యకశిపుడు—విధి ననుష్ఠింపవలెను.

ధ్వని—నీకు బంధు బాంధవులా 'నా' యని చెప్పుకొన తగినవా రెవరును ఉండరు.

హిరణ్యకశిపుడు—విధి తప్పదు.

ధ్వని— హిరణ్యకశిపా !

హిరణ్యకశిపుడు—ఆఁ !

ధ్వని—పూర్వాపరముల నాలోచించు కొనుము. నీకు మనసిచ్చి మాటాడు జీవి యొకడైన యుండడు.

హిరణ్యకశిపుడు—[వికటాట్టహాసము చేయును.]

ధ్వని—ఏల యీ వికటాట్టహాసము ?

హిరణ్యకశిపుడు—సంకల్పసిద్ధికై సర్వ పరిత్యాగమునకు నడుము కట్టిన వానికి ఈ అల్పవిషయములు భయజనకములా ? [నవ్వును]

ధ్వని—హిరణ్యకశిపా !

హిరణ్యకశిపుడు—ఏమి ?

ధ్వని—నీవు మృత్యువును జయించితివి. నీకజేయ మెద్దియును లేదు.

హిరణ్యకశిపుడు—మరచితిని. చింతనీయాంశ మొకటి యున్నది.

ధ్వని—ఏమది ?

హిరణ్యకశిపుడు—అధికార బలప్రాప్తి నాశించు పాపకలుషిత మాన సులు—

ధ్వని—హిరణ్యకశిపా ! నీవు మహాపురుషుడవు. నీ అనంతరమున నయిన, కాదా యుగాంతరమున నయిన యిట్టి దురాశాపీడితులగు నీచుల సయితము జయించగలవు. విజయోస్తు !

హిరణ్యకశిపుడు—విప్లవము విజయలక్ష్మిని చెట్టి పట్టు గాక !

ధ్వని—విప్లవమునకు జయమగుగాక !

[దిక్తటముల, 'విప్లవమునకు జయమగుగాక' యని ప్రతిధ్వనించును.]

అంతయు నిశ్శబ్దము. గాడాంధకారము. మందగానము. నిశ్శబ్దము.

తెర

ప్రథమరంగము

(ప్రభాతకాలము : రాజసౌధమున పఠన మందిరము. గోడలమీద భగవత్ చిత్రపటములు.

ప్రవేశము : హిరణ్యకశిపుడు. అలంకారము లేవియును లేవు. యజ్ఞోపవీతము, తిలకము వుండవు. ప్రవేశించినంతనే ఉత్తరీయమును ప్రక్కనున్న పీఠముమీదికి విసరి గోడల వ్రేలాడు చిత్రపటముల నన్నింటిని వెంటనే తొలగించి దొంతరగా పెట్టును. పఠనాలయ మందున్న పూర్వ తాళపత్ర గ్రంథములనుచేర్చి కుప్పగా పెట్టును. తాను వెంట తోడితెచ్చిన క్రొత్త తాటియాకుల పొత్తమును జాగరూకతతో నొక వేపుంచును)

ప్రవేశము : శుక్రాచార్యులు. షష్టికి మించని వయస్సు. గుంటలు వడి కనీకనబడవి జాజ్వల్యమాన నేత్రములు. ముందుకు పొడుచుకొని వచ్చు తెల్లని గడ్డము, అతడు గూఢాలోచనాపరుడని చెప్పకయే చెప్పుచున్నవి.]

శుక్రాచార్యులు—హిరణ్యకశిపా !

హిరణ్యకశిపుడు—ఆచార్యా ! నమస్కారములు.

శుక్రాచార్యులు—[దీవించును] అశేషశేముషీ విశేష విలసితుండవయి, సకల భోగ భాగ్య సంపన్నుడవయి, దారా పుత్ర పౌత్ర చిర సౌభాగ్య విభూతిలో చిరంజీవివగుత !

[హిరణ్యకశిపుడు చిరునగవుతో నేదియో చెప్పబోవు చున్నంత ఆచార్యులద్దము వచ్చును.] హిరణ్యకశిపా ! నేడు కడు సుదినము.

హిరణ్యకశిపుడు—[నవ్వుచు] సుదినమా !

శుక్రాచార్యులు—[మిక్కిలి సంతోషముతో] కాకేమి? నేత్రపర్వమై సొంపులు వెలిగ్రక్కుచు శోభాయమానముగనున్న పురము నొక్కతరి వీక్షింప లేదా! [ఆగి] అవును! నిరంతర కార్యసమాలోచనా పరుడవు, నీవు పట్టణ మెట్లు చూడగలవు?

హిరణ్యకశిపుడు—ఆచార్యా! ఏమనుచున్నారు?

శుక్రాచార్యులు—ఏమా! పట్టణమంతయు నీ దినము అపూర్వశోభతో నల్లల లాడుచున్నది. ఎక్కడచూచినను తరంగాయమానమగు సంతోషమే! ఏ వైపు పరికించినను నిర్మలానందమే! తోరణములు, పతాకములు, వింత వింత శృంగారములు పురమునంతటి నలంకరించుచున్నవి. ఆనంద సంకీర్తనములు నలుదెసల స్వచ్ఛంద విహారములు సల్పుచున్నవి. పురమంతయు ఆనంద నిలయమై నర్తించుచున్నది.

హిరణ్యకశిపుడు—ఇట్టి ఆనంద విజృంభణకు హేతు వేమి?

శుక్రాచార్యులు—హేతువా? ఆరు సంవత్సరముల పర్యంతము ఘోర తపమొనరించి లోకంబునకు కల్యాణమును కూర్చ నేతెంచిన తమ ప్రభుని దర్శింప ప్రజల కానందము మితిమీర గలుగదా!

అహోరాత్రములు ప్రజల హితముకొరకై కటి బద్ధుడవయి, దీక్షతో కష్టములను కొగలించుకొనుచు శాశ్వత కల్యాణమే స్వీయ మోక్షముగ నెంచి, వేరు తలంపులులేని స్వార్థరహితుడ వయిన నిన్ను జూచిన ప్రజల కెంత యానందమో, ప్రజల నొక్కరుండవుగాని రాజువు నీ వే మెరుగుదువు?

హిరణ్యకశిపుడు—అవును! నేనిప్పుడు ప్రజలలో నొక్కడయిన నెంత బాగుండెడిది! నా జీవితమం దొక్కమారైన నిర్మలానందము నంది యుందునుగదా! ప్రజల హితమునకై నిర్ధారితమయిన రాజవంశమ్మున బుట్టి వారి పాలకుడ నైనందులకుగదా నాకు నిత్య మెడతెగని చింత.

వారి కష్ట నష్టములు, విపత్పరంపరలు తప్ప నా కన్య మెద్దియును గోచరించదుకదా ;

భూమండలమున ఒక వస్తు ప్రాప్తిచేతనో, ఒక విషయోపలబ్ధివలననో యొక వ్యక్తి పంతసించుట పొసగవచ్చును. కాని అందులకు మారు ఆ సంతసమునకు పదిరెట్లు మొత్తుకొనువా డుండుట రూఢి.

అవును ; అధికారము, బలము, ధనము స్వల్పసంఖ్యాకుల చెంతనే యిల్లు కట్టుకొని యున్నవి. ముప్పూట వారికి కడుపార తిండి ; సుఖ నిద్ర ; పెక్కు వినోదములు ; * * * * రాజు కుశలముగ నగరమునకు మరలి వచ్చినప్పుడు వారికి మహాపర్వము కాని, కావి ఈ అల్ప సంఖ్యాకుల విలాసమయ జీవితాభివృద్ధికై, దినమున కొక్క తూరి యయిన కడుపార నారగింపనోచక, కట్టుబట్ట లేక, నివసింప గృహములేక, చెల్లను గుట్లను ఆశ్రయించి, ఆకలి చిచ్చునకు కుమిలి కృశించి రేబవలు కాయకష్టముచేయు అశేష సంఖ్యాకులగు దీనులు సుఖించు చేనాడు ? వారి క్షుద్బాధాగ్ని జ్వాలలు చల్లారు చెన్నాడు ?

ఆచార్య ; ఈ ఆమోద కోలాహలమునందు సైతము వారి ఆక్రందన ధ్వానములే వినవచ్చుచున్నవి. హృదయమును కంపింప జేయుచున్నవి. * * * * వారి వేదన దుర్భరము.

ఆచార్య : అవును. నా కింకను ప్రజల సంతోషమునకు కారణ మర్థము కాలేదు. ముం దర్థ మగు నేమో ;

శుక్రాచార్యులు—అవును ; నిరతమును ప్రజల దుఃఖములనే ఆరయుచు, వారి హితవు నాలోచించుచు, వారి సమస్త భయదుఃఖముల వారింపు తలంపున కాలమెల్ల సద్వినియోగ మొనర్చు వసుమతీ నాథుడవు ;

అట్టి నీకు వారి ఆనందహేతువు స్ఫురించుటెట్లు ?

అయినను ఈ దిన మొక్కతూరి పట్టణ మవలోకింపుము. వేదలు

సాదలు, స్త్రీలు, పురుషులు, వేయేల, సమస్తజన మెంతయానందము ననుభవించుచున్నా రో కనులార గనుము.

కడుపునిండ సారాయమునుద్రావి ఒడలు తెలియక హిరణ్యకశిప మహా రాజునకు జయ మనుచున్న నిరుపేదల పెక్కులనే కనులార గాంచితిని.

హిరణ్యకశిపుడు—[గంభీరస్వరమున] అవును; అదికదా వారలకు మిగిలియున్న సౌఖ్యము. దుర్భర కష్టసముదాయములనెల్ల మత్తుచే తాత్కాలికముగ నెడబాపు నాయమృతమే వారల కప్పుడప్పుడు శరణ్య మగును. దానినికూడ నెంతమంది యానందించగలరు? [ఆలోచించి] ఆచార్యా! ఇది మహాగాధ. దీని బాగోగులు పిదప విన్నవించు కొంగము....తాము దయచేసిన కారణము సెలవిత్తురా?

శుక్రాచార్యులు—అంతగా నెద్దియునులేదు. కులగురువునుగాన నీ యోగ క్షేమములు విచారించి పోవ వచ్చితిని. అపార తపమొనరించి నీవు సంపాదించిన మహాశక్తి యెద్దియో వివరింపగలవా?

హిరణ్యకశిపుడు—(మందహాసమున) శక్తియా!! జ్ఞానమును సము పార్జించితిని. వివేకోదయ మైనది!! మృత్యువును జయించితిని! ఆరు సంవత్సరముల తపఃఫలిత మిదిగో, ఈ క్రొత్త పొత్తము. (నూతన గ్రంథమును జూపును.) (శుక్రుడు ఆ గ్రంథములను జూచును. అతని చూడ్కులు, చేర్చిన పురాతన గ్రంథములపై ప్రసరించును. చూచినకొలది సందేహము విస్మయము మోముపై వర్తించును. హిరణ్యకశిపుడు ప్రసం గము చేయుచునే యుండును.) ఆరు సంవత్సరముల సంపాదిత జ్ఞాన ఫలము ప్రచండ మృత్యువు నవలీల జయింప సమర్థమన మహాశక్తి!!

శుక్రాచార్యులు—[ఆశ్చర్యముతో] ఆఁ! ఆఁ! ఏమి!!

హిరణ్యకశిపుడు—అవును, మన పూర్వులెరుంగని మహాశక్తి చండ ప్రచండమగు సతులశక్తి అజేయ అపార అత్యద్భుతమయిన ప్రళయ శక్తి ఈ మహా శక్తి మూలమున నాకిలాతలమున మృత్యువులేదు. మృత్యుంజయుడను అజరామరుడను.....నాకు సామాన్య నరుల చావులేదు.

శుక్రాచార్యులు—ఆఁ మృత్యువునే జయించితివా?

హిరణ్యకశిపుడు—ఆ మృత్యువునే.

శుక్రాచార్యులు—హిరణ్యకశిపా ఇక ప్రజల యానందమునకు మేరయుండునా? ప్రజల దుఃఖవేదనలచే అనారతము గుందుచు, వారి హితమే తన నిజసౌఖ్యమని యెంచు మహాపురుషుడు వారి పరిపాలనకర్తయై చిరంజీవియైయుంట వారికి ఆనందహేతువుగానుండును

[ఆశీర్వదించును] నీ కోర్కెలు సఫలమగుగాక ప్రజలకు సర్వసౌఖ్య ప్రదాత వగుదువుగాక

హిరణ్యకశిపుడు—ఆచార్యా ఆశీర్వాదముల కెంతయు కృతజ్ఞుడను. కాని—నా శక్తియన యేదియో మీరు పూర్ణముగా గ్రహింపలేదుగదా

శుక్రాచార్యులు—అగుచో సర్వము విశదీకరింపుము.

హిరణ్యకశిపుడు—సామాన్య నరులకుండు చావు నాకులేదన్న నేను గిట్టకుందునని కాదు. [క్రొత్త గ్రంథమును జూపుచు] ఇందు భద్రపరచిన జ్ఞానమును లోకమునకు నివేదింతును. తత్సహాయంబున లోకంబున క్రాంతిని గల్పించి ప్రస్తుతమున్న సంఘ దుర్గాచారములను నిర్మూలించి, లోపములను సవరించి, లోకమును చక్కబెట్టెదను. ప్రజల కనంతసౌఖ్యములపేకరింతును. నరుని నరుడు బాధింపలేడు. పరస్పర సహకార భావమున లోకము మరింత సౌఖ్యములతో తులతూగుచుండగలదు.

శుక్రాచార్యులు—ఇందు సామాన్య నరులకుండు చావు లేకుండు టెట్లు?

హిరణ్యకశిపుడు—లోకమునం దింతటి మహా పరివర్తనము తెచ్చిన హిరణ్యకశిపుని మరతురా? ఇది సామాన్య నరుల చావా? [నవ్వును]

శుక్రాచార్యులు—(హిరణ్యకశిపుని కొంచెము సేపు తిలకించి) ఎట్టిది నీవు సంకల్పించిన సంఘ సంస్కరణము, నీ విప్లవ మేరూపు దాల్చును?

హిరణ్యకశిపుడు—ప్రథమమున లోకమున వర్తిల్లుచున్న మతాచారముల నిర్మూలన మొనరించును.

శుక్రాచార్యులు—ఆఁ! ఆఁ! ఏమి? మతాచారములు లోకమున కంతటి అహితములా?

హిరణ్యకశిపుడు—అవును! మతమనునది లేకున్న లోకమున యింత కష్టము, పాపము, వంచనము, హింస మొదలగు ఘోరారిష్టముల కునికియే యుండదు.

శుక్రాచార్యులు—(క్రోధము నణచికొనుచు) ఎంతమాట! మత విధ్వంసము దైవద్రోహము కాదా?

హిరణ్యకశిపుడు—దైవమే లేనపుడు మానవుడు దైవద్రోహి యగు టెట్లు?

శుక్రాచార్యులు—(హిరణ్యకశిపుని ఆపాదమస్తకము పరిశీలించును. ఆశ్చర్యముతో ఇది కలయా! నిక్కువమా! కన్నులు మోసపుచ్చుట లేదుకదా?

హిరణ్యకశిపుడు—ఏమది?

శుక్రాచార్యులు—నీ ముఖమున తిలకములేదు. నీ భుజమున జందెము లేదు.

హిరణ్యకశిపుడు—నిక్కువమే. సంఘసంస్కారమునకై దీక్ష వహించి

నిజధర్మము ననుష్ఠింప కృతసంకల్పుడనైన నేను, స్వయముగ మతము నందలి నా యవిశ్వాసమును తెల్పుట కిట్లాచరించితిని.

శుక్రాచార్యులు—హిరణ్యకశిపా! నీవు నాస్తికుడ వయినావు. లోకము నెల్ల నీకువలెనే భ్రష్టము చేయజూచుచున్నావు. నీకు అంగబలముకలదు. కాని దైవము నిన్నొదుర్కొన గలదు జాగ్రత!

హిరణ్యకశిపుడు—(వికటహాసముచేయును)

శుక్రాచార్యులు—ఏమి ఈ పిచ్చినవ్వు!

హిరణ్యకశిపుడు—లేని దైవము నన్నొక్కెదుర్కొనునా యని!

శుక్రాచార్యులు—హిరణ్యకశిపా! ఆలోచించుకొనుము. ప్రమాదమున బడకుము! కోరి నరక కూపమున బడకుము.

హిరణ్యకశిపుడు—ఆరు సంవత్సరములు దీక్షతో చింతించి స్ఫురణ గావించి, విధి నాచరింప నుద్యుక్తుడగు నేను పొరబడుచెట్టిది! ఆచార్యా! త్వరపడకుడు. సర్వము సావధానులై చిత్తగించి యధాశక్తి తోడ్పడుడు.

శుక్రాచార్యులు—ఛీ! ఛీ! నీతో నన్ను సయితము నరకకూపమున దూక మందువా! (చివుక్కున తిరిగి వెడలిపోవును.)

హిరణ్యకశిపుడు—(ఆచార్యుని ప్రస్థానము గమనించి), ఏమి వెఱ్ఱి తనము! (తెరలో వికటహాసము)

హిరణ్యకశిపుడు—[కృద్ధస్వరమున] ఎవరది!

ధ్వని—వెఱ్ఱితనమా! అధికార మద సంకులమైన చిత్తవికారమా! (నిశ్శబ్దము) (హిరణ్యకశిపుడు ఆలోచించుచుండును. మందగానము.... నిశ్శబ్దము....హిరణ్యకశిపునకు స్మృతివచ్చినటు లుండును.)

హిరణ్యకశిపుడు—ఏమి జరిగినది! ఆచార్య డప్రసన్నుడై వెడలి పోయెనా! సర్వమాతని కెరిగింప నయితిని....మరియొకసారి జూచెదను. (తెరదెసజూచి) ఎవరురా అక్కడ!

(ప్రవేశము ద్వారపాలకుడు)

ద్వారపాలకుడు—జయము ! జయము ! మహాప్రభూ.

హిరణ్యకశిపుడు—(తాను పేర్చిన కుప్పలనుజూపి) వీని నన్నింటిని వెంటనే దహింపుము.

(నూతన గ్రంధమును గైకొని నిష్క్రమించును.)

ద్వారపాలకుడు—(కుప్పలను జూచుకొలది ఆశ్చర్యము హెచ్చగును) వీటినా?

తెర

,,,,,,,,,,

22

ద్వితీయ రంగము

[ప్రభాత కాలము: ఎనిమిది గంటలవేళ: ఆలోచనామందిరము, మంత్రి, సేనాని, రాజపురోహితుడు ఆశీనులై యుందురు: మంత్రి: ప్రాయము రమారమి డెబ్బది, సన్నని పొట్టి మనిషి, చిన్నకండ్లు, పొడుగాటిముక్కు, పెద్దనుదురు: నక్కను స్మృతికి తెచ్చుచుండును. సేనాని: నలువది వత్సరములు. సహజ గాంభీర్యమును వెలిబుచ్చు ముఖము. ఆజానుబాహువు, కోరమీసములు. కరవాలము. పురోహితుడు: రూపొందిన పొరోహిత్యమే: వయసు ఏబది. వారి ఆసనములకుమధ్య ఉన్నతాసనమొకటి.

పురోహితుడు—ఇంత జాగేల చెపుమా: వేగిరమే వత్తుమని మహారాజా వారు వార్తనంపిరిగదా:

సేనాని—బహుశః అంతఃపురమునకు వెళ్లియుందురు.

మంత్రి—కాదు. అంతఃపురమునకు కార్యాలోచన ముగిసికాని వెళ్లనరి.

పురోహితుడు—అయిన ఏల ఈ విలంబనము:

మంత్రి—ఏమో:

(బయట నేదో సద్దు. మంత్రి అటు తొంగిచూచును)

మంత్రి—అదిగో: రాజువారే స్వయముగా దయచేయుచున్నారు.

(అందరు లేచి నిలుచుందురు. ప్రవేశము: హిరణ్యకశిపుడు ధైర్యోత్సాహము లాతని మందహాసమున ప్రతిఫలించుచున్నవి.)

హిరణ్యకశిపుడు—ఆలస్యమునకు క్షంతవ్యుడను. (ఆసనమలంకరించును)

పురోహితుడు—మిమ్ములను క్షమింప మే మెంతవారము:

హిరణ్యకశిపుడు—మానవు లెల్లరు సములు. న్యూనాధిక భావము స్వయం కల్పితము. ప్రతిమానవునకు తన సోదరమానవుని క్షమింప హక్కు అర్హతలున్నవి. కూర్చొనుడు. (అందరు కూర్చుందురు)

హిరణ్యకశిపుడు—నా సంకల్పము సిద్ధించుగాక.

మంత్రి—హిరణ్యకశిపుని సంకల్పమున కపజయముకూడనా?

హిరణ్య కశిపుడు— నా కపజయమన్న భయము లేదు, జయాపజయములు సహజ పరిణామములే.

సేనాని—మీ ఆజ్ఞల సదా నెరవేర్చు భృత్యులుండ అపజయమా?

హిరణ్యకశిపుడు—భళీ! నిజమగు భృత్యునివలెనే పలికినావు.

పురోహితుడు—ముల్లోకముల జయించిన మీకు భృత్యుడు కానివాడెవడు.

మంత్రి—కనుసన్నమాత్రమున లోకలమునెల్ల జయించి ప్రభుపాద సన్నిధిని సమర్పించుకొనగల సేనానులుండ, అట్టి రాజునకు భృత్యులు కానివా రెవరుండ గలరు?

సేనాని—(హర్షించును)

పురోహితుడు—సేనాపతులు పెనగులాడ నవరస మేమున్నది? రాజు తపోబలము చాలదా, ఎల్ల లోకముల చూపగ చుట్టి తెచ్చుటకు?

మంత్రి—పిచ్చిబాపడ! తపశ్శక్తి ఇట్టి క్షుద్రకార్యములకా వినియోగించుట! ఇట్టి పనులకెల్ల సైనికబలము చాలదా?

హిరణ్యకశిపుడు—ఏమి వెర్రి?

పురోహితుడు—(వినిపించుకొనకయే) పురాణవచనములు అక్షరశ: ఋజువయినవి.

మంత్రి—పురాణవచనము లెవ్వి?

పురోహితుడు—ఎవ్వా? మహా తపమొనరించిన మహాఋషులు సైతము, కోపమాత్రమున రాక్షసకులముల నెల్ల నాశనముచేయుశక్తి సంపాదించినప్పటికిని, అద్దానిని వినియోగించక రాజులవద్దనుండి సేనాసహాయము ననేతమ కాత్రవ విజయమును స్వీకరించియుండిరి.

హిరణ్యకశిపుడు—(పకు్కన నవ్వును.)
(హిరణ్యకశిపుని నవ్వనుజూచి ఎల్లరు నవ్వుదురు)
హిరణ్యకశిపుడు—ఏల నవ్వుచున్నారు?
పురోహితుడు—తమ సంతోషము లోకకల్యాణమును సూచించదా?
హిరణ్యకశిపుడు—పిచ్చిబాపడా! నే నేల నవ్వితినో యూహించితివా?
మంత్రి—ఏల మహాప్రభూ!
హిరణ్యకశిపుడు—మీ మూఢత్వమే నానవ్వునకు కారణము.
మంత్రి—మూఢత్వమా?
హిరణ్యకశిపుడు—పొరబడితిని,—ఈ మూఢత్వము మీతోసరిపోలేదు. లోకమంతయును దట్టముగ నావరించినది.
సేనాని—ఎట్టిదా మౌఢ్యము?
హిరణ్యకశిపుడు—ఎట్టిదా? మహాఋషులు తపోబలమున లోక సంహారము చేయగలరనుట కటికకల్ల. తపోబలముచే పశుపక్షి తృణ మాత్రమేని లభించదు. వారు తపోబలముతో చేయగల్గునది, కేవలము, నయమునకో, భయమునకో, రాజుల కడనుండి సేనాబలముల మూతగాగొని కార్యసిద్ధిని బడయుట యొక్కటియే:
మంత్రి, సేనాని—(ఆశ్చర్యముతో) యేమంటిరి?
(పురోహితుని కన్నులు జేవురించును.)
హిరణ్యకశిపుడు—వీటినిగూర్చి పిదప వివరింతును. ప్రస్తుతము, మన మవసర కార్యమును సర్వమునుగూర్చి యాలోచింతము.
మంత్రి, పురోహితుడు—చిత్తము.
హిరణ్యకశిపుడు—ఆరు సంవత్సరముల తపఃఫలితము, ప్రస్తుత ప్రజల బాధల తొలగించుటకు ఉత్తమ సాధనమయినది. ప్రజా దుఃఖ నివారణమే నా స్థిరసంకల్పము. ఇదియే నాజీవిత లక్ష్యము. మీరెల్లరు ఇందుకు సాయపడుదురని నాకోరిక.

మంత్రి ఆదేమిమాట; సాయపడుచేమి; మీ యాజ్ఞ నౌదల దాల్చి సదా సిద్ధులమేకదా;

పురోహితుడు—తమ ఇచ్చకు లోకమున ఆటంకముండునా; పేనాని—మీ కన్ను సన్నల మెలగుచు నేనుండి తమ శాసనములు రెప్ప పాటు కాలమున సిద్ధింపకుండునా;

హిరణ్యకశిపుడు—నా సంకల్పము మూఢత్వ వినాశనము. లోకమున మూఢులు అంధవిశ్వాసబద్ధులు, పిచ్చినమ్మకములచేత కీలుబొమ్మ లన దగు వివేకాందులకు సముచిత ధర్మపథమును జూపుటయే, నా పరమావధి.

మానమున్ గాచికొన దగు బట్టలేక
కడుపు చిచ్చును నార్చికో గంజిలేక
నిలువ భూమిపై నెక్కడ నీడలేక
పొట్ట నరచేత నిడుకొని చెట్టుపుట్ట
నాశ్రయించుచు వెతలొందు నార్తజనుల
దుఃఖనాదంబు వినలేక కూలిపోదు.

జన్మహక్కుల గోల్పోయి జడత నణగి
మణిగి నిర్జీవ ప్రతిమలై బ్రతుకువారి
నిత్యదారిద్ర్య దేవతా నిలయమయిన
జీవితంబుల నూతన జీవకళల
గొలుపు గీతంబు పాడెద కొమరు మెరయ.

దీనులగునట్టి వారిని దాస్యశృంఖలములనుండి విముక్తుల చేయుదము. మానవుని లోకమున భయమను పిశాచమునుండి విముక్తునిచేసి, సౌఖ్య సంపన్నుని కావింతము. మనుజునిపై మనుజునకు, నిరంకుశాధికారము లేకుండజేసి, పాసినతనమును కూకటివేళ్లతో పెళ్లగించివైచి, సర్వ

మానవ సమతగల నవీన లోకమును సృష్టింతము. ఇదియే నా స్థిర సంక
ల్పము. దీనికే సాహాయ్య మపేక్షించుచున్నాను.

పురోహితుడు—ఇట్టి యోగ్యమయిన సంకల్పమునకే తోడ్పడకున్న మా
మానుషత్వమేల:

పేనాని—నేను తమ ఆజ్ఞకొరకై కదా వేచియున్నాను.

మంత్రి—అయిన....మహాప్రభూ!....ప్రస్తుతమున్న మూఢత్వమెద్ది?....
దానిని ...తామెట్లు తొలగింపగలరు?....దయచేసి....!

పురోహితుడు—మంత్రివర్యుని....సందేహము....నివారించిన....నా సం
దియమును....తమరు.

హిరణ్యకశిపుడు—సరి! ప్రస్తుతకాలమందు లోకమున దట్టముగ అలము
కొనియున్న దీ అజ్ఞానము. ఈ అజ్ఞానము ఒక్క నాల్గవ, ఐదవ జాతులదే
కాదు, అన్నిజాతులందును ఏల?—ప్రతిమానవునియందును విండి నిబిడీ
కృతమయియున్నది.

పురోహితుడు—అగ్రజాతీయులగు ద్విజులయందును కూడనా?

మంత్రి—పరమపావనులగు బ్రాహ్మణులందు వయితమునా?

హిరణ్యకశిపుడు—నిస్సంశయముగ! భూసురులగు విప్రులందే కాదు,—
సర్వసంగ పరిత్యాగులయి, అడవులకేగి కందమూలముల జీవించుచు,
తపమొనరించు యోగులు, మునులు తపస్వులందును, నిరంకుశ విహా
రము చేయుచున్న దీ యజ్ఞాన పిశాచము.

పురోహితుడు—తాపసేంద్రులయందు కూడనా?

మంత్రి—హా! హా! హా! మహాఋషులకు వయితము వేద్యముగావి
పరమ విగూఢ జ్ఞానమును సంపాదించిన మహా యోగిపుంగవులు!
తమ్మాక్రయించుటచే మేమును ధన్యులమయితిమి.

పురోహితుడు—అజ్ఞాన మెట్టిదో సెలవిందు.

హిరణ్యకశిపుడు—సృష్ట్యాదియందు మానవుడు జన్మమె త్తగనే అపారమై, అనంతమై, గంభీరమై యొప్పు ప్రకృతిని విలోకించెను. వీక్షించి నిర్విణ్ణు డయ్యెను. భయకంపితుడయ్యెను. వానికి సర్వము అగమ్యగోచరముగ నుండెను. తా నెచట నుండెనో, యెచటినుండి యూడిపడెనో తెలియ జాలడయ్యెను. ప్రకృతి యతనిని భయస్మయముల తేల్చివైచెను. అనంత, గాఢ మేఘావృత శ్యామలాకాశము, సాంద్రాటవులు, గగన చుంబిత భూధరశ్రేణులు, తారకాదిగ్రహములు అగణిత పశు పక్షి క్రిమి కీటకాది జంతుజాలములన్నియు, వానికి వింతగ దోచి భయమును కల్పించెను.

మంత్రి, సేనాని—తరువాత:

హిరణ్యకశిపుడు—తరువాతనా: తన్నుతా జూచుకొనియెను: తన శక్తిని ప్రకృతి శక్తియెదుట పరిశీలించుకొనెను: విశ్వములో తానొక యణు మాత్రమే యని గుర్తించెను. ఇంకేమున్నది: భయ మాతని హృదయ మును గట్టిగా నావరించెను. ఇక ప్రకృతి నారాధించినగాని తన బ్రతుకు నకు ఆస్కారముండదని తలపోసెను అతడంత ప్రకృతికి సాష్టాంగ దండప్రణామ మాచరించెను.

వానికిక, చెట్లుచేమలు, రాళ్లురప్పలు, కల్పిత భూతప్రేత పిశాచములు, ఇవియవి యననేల: దృశ్యాదృశ్య పదార్థములన్నియు వానికి వంద్యము లయ్యెను. ఈ పూజ్యవస్తు సంతతులపై అతడొక మిథ్యామూర్తిని ఆది పతిగ నొనరించెను. వానినే దేవుడని పిలచెను. వాని నెరుంగుటయే జీవితలక్ష్య మయ్యెను. వానిని ప్రార్థించుటే ఉత్తమ పురుషార్థమని సిద్ధాంతీకరించెను. వాని యాధిక్యమును గూర్చి కలిగిన అంధ విశ్వాస ములనే మతము మతమని కలువరించి సూత్రీకరించెను.

ఈ మతమునకు కొలది కాలములోనే హద్దుపద్దులు నశించినవి. మూట ముల్లెల సేకరించుట కిది మూలమంత్ర మయినది. ఈ మతమునుండి బయల్వెడలినదే పౌరోహిత్యము—పాములవాని చేతిలోని నాగస్వరము వలె మానవుల్నెల్ల అంధవిశ్వాస మంతబద్దులచేసినది. దీని కండగా ఆచారములు, మఠములు, పీఠములు, గుళ్లు, గోపురములు అబ్బినవి. భూతదయమందలి నిరుపయోగ నీతి నియమములు సృష్టింపబడి మానవున కంటగట్ట బడినవి. వీనిని నడుపుటకే సంఘమొక విష్ణువును గల్పించి రాజదండమునిచ్చి రాజగద్దియ నెక్కించినది.

పురోహితుడు—శ్రీ హరీ! ఎంతమాట! చిటికలోన సమస్తమును మిథ్య యంటిరే!

హిరణ్యకశిపుడు—ఆచార్యా! పూర్తిగా వివేకము నుపయోగించి విచారింపుడు. పాశ్చికబుద్ధి వలదు! మిథ్యాభిమానము వలదు. స్వార్థచింతన లేక సర్వజన కల్యాణప్రీతితో నే నారయు సత్యమును గ్రహింపుడు. దేవుడుకల్ల, మతముమిథ్య యనుట మీ హృదయము నొకింత నొవ్వజేసి యుండనోపు. కాని....కాని....భగవంతు డెల్లరకు పూజ్యుడయిన, యెల్లర సమత జూడడేమి?

మతము లోకకల్యాణమునకన్న, వాని కారణమున నెంతరక్తస్రావము, మోరాన్యాయము లెన్ని జరుగుటలేదు?

పౌరోహిత్యము శుభముల కూర్చుటకన్న పురోహితుల యాశీస్సులెన్ని విరుద ఫలముల నీయుటలేదు?

సమాజము పరస్పర న్యాయ సహకార విధానమును సృజించుచున్న, నేడు సంఘమునే అడ్డుగాజేసికొని బలవంతులు, సంపన్ను లెందరు దుర్బలుల బిట్టి పీల్చి పిప్పిజేసి, వారిని మానవుల సహజహక్కుల నుండి వంచితుల గావించుటలేదు? ఇక రాజులా! పురోహితుల, మతగురువుల

చేతులలోవి కీలుబొమ్మలు. చౌర్యమునకు చిమ్మచీకటి చేయూత నిచ్చునట్లు రాజులు మతముపేరిట జరుగు ఘోరదురంతముల ఆచరణయందు బెట్టు కింకరులేగదా!

అబ్బా! ఇప్పటి లోకధర్మ విధానమును తలంచినంతమాత్రాన గుండెలు చెక్కలుగాక మానునా?

పురోహితుడు—మహాప్రభూ! న్యాయశాస్త్రము వేదవేదాంగ నిర్దిష్ట నియమములు, మీరిన మీ యీ నవ్యభావ పరిణతి విన్నకొలది భయము కలుగుచున్నది.

హిరణ్యకశిపుడు—హ! హ! హ! భయము కలుగుచున్నదా! బలవంతుడు బలహీనుని నోటికడనుండి ముద్దను గుంజివైచుట జూడ భయమును గొలుపదు! సమస్తమును సంఘ రాజ బలము దోచిన దీనులు, ఆకలిచిచ్చునకు కుమిలిపోవుట, భోగభాగ్యముల తులతూగు మీకు భయమును గొలుపదు! సంపన్నులగుటకు ప్రకృతిని దోచుట మీకు భయమును గొలుపదు! ఆకలి దహింప, తెన్నుగానక, హతాశుడయి, జీవన సహజ ప్రేరణచే ఆసంపన్నుల కొల్లగొనిన దీనుల చోరులని నిర్ణయించి కఠిన దండన విధించుట భయమును గొలుపదు! కాని నా సత్యవచనమే భయమును గొలుపుచున్నదా! హ! హ! హ! ఎట్టి దైవభక్తి? ఎట్టి ధర్మపరత? చిత్రము! చిత్రము!!

పురోహితుడు—ఐన మతము మానవకల్పితమే?

హిరణ్యకశిపుడు—నిస్సంశయముగ!

పురోహితుడు—మన వైదిక మతమును సైతము విశ్వసింపరా?

హిరణ్యకశిపుడు—వైదిక మతమేల? ఏమతము విశ్వసనీయముకాదు.

పురోహితుడు—వేదములమాట? అవి అపౌరుషేయములు కావా?

హిరణ్యకశిపుడు—వేదములు కేవల పౌరుషేయములు! మానవ రచితములు.

పురోహితుడు__అవతారములు?

హిరణ్యకశిపుడు__అవతారములు శైవ వైష్ణవ కల్పితములు.

పురోహితుడు__(భయముతో) ఇంక మీ కీ లోకమున వలయునదెద్ది? మీ జీవితసంకల్ప మెట్టిది?

హిరణ్యకశిపుడు__భ్రమను, సింహాసన భ్రష్టనుజేసి ప్రమకు పట్టము కట్టుట.

పురోహితుడు__తమ తాత్పర్యము?

హిరణ్యకశిపుడు__(గంభీరస్వరమున) నిప్పి చెప్పవలయునా? ప్రథమ వంచనమగు దేవుని లోకమునుండి పారద్రోలుట; పిదప మతమునకు స్వస్తిచెప్పుట

పురోహితుడు__సర్వనాశనము, అరాజకత్వము, యివియేనా మీ ఉదార సంకల్పములు.

హిరణ్యకశిపుడు__అయ్యో! ఎంత వెర్రి! నాసంకల్ప పరిణామము సర్వ మానవ సమత్వ సంస్థాపనము! జగత్ కల్యాణము!

పురోహితుడు__సరి! సరి! ద్విజుల నద్విజుల సంకరము.

హిరణ్యకశిపుడు__ఆచార్యా! జన్మచే ఎల్లరు సమూలే. ప్రకృతీ కావ్యము తన సర్గలనిప్పి ఎలుగెత్తి సర్వసమత్వము నాలాపించుచుండ యీ కల్పిత కుటిల స్వార్థవ్యాఖ్య లేల? ఒక మానవునిపై ఇంకొకనికి అధికారము నిచ్చినదెవరు? ఒకరి మోక్షమున కొకరు కర్తలా? అమాయకుల గొంతులుగోయ జగత్ గురువులకు నిరంకుశాధికార మిచ్చిన దేవుడెంతటి క్రూరుడు? ఇవి మానవ నిర్మిత స్వార్థసామ్రాజ్య హుంకారములే కాని, న్యాయ సిద్ధాంతములు కావు. ఇట్టి ఘోరముల తుద ముట్టించుటయే నేపట్టిన గట్టి వట్టు.

జగములన్నియు నివ్వెరగంద స్వార్థులు కంపింప
మతము మంటి గలియ దేవుడు దిక్కులదార

నేనీ సర్వమానవ కల్యాణ ప్రభాభాసురమయిన, విప్లవమును, మహా విప్లవమును సృష్టించెదను; ఇదియే నా దృఢసంకల్పము.

పురోహితుడు—(భయమున కంపితుడౌను, ముఖము పాలిపోవును) అగుచో దైవమును వెళ్లగొట్టెదరా?

హిరణ్యకశిపుడు—ఇంకను సందియమా?

పురోహితుడు—అయ్యో! ఎట్టి పాపమున కొడిగట్టితిరి?

హిరణ్యకశిపుడు—పాపము పుణ్యము స్వార్థుల పగటి వేషములు. సోదర మానవుని సమత గాంచలేని స్వార్థపరుల దుష్కృత్యములు. (పురోహితుడు, మంత్రి దిగాలుపడి తత్తరపాటుతో ఒకరి మొగ మొకరు చూచుకొనుచుందురు. సేనాని దీర్ఘముగ నాలోచించుచు నేలను తిలకించుచుండును.) ఎందుకీ చీమ చిటుక్కుమనని నిశ్శబ్దము?(ఒక నిమిషము గడచును)

ధ్వని—హిరణ్యకశిపా! దీర్ఘముగ నాలోచించుకొనుము; నీవు దుముకుచున్నది అగ్నిగుండములోకి, జాగ్రత!

హిరణ్యకశిపుడు—(నెమ్మదిగా) ఏమి? నే దుముకునది అగ్నిగుండములోనికా? కానీ! కర్తవ్యము నెరవేర్చ వలసినదే! (కొంచము విగ్గరగా) సేనానీ! (సేనాని తలయెత్తి హిరణ్యకశిపుని వంక జూచును) సేనానీ! నా శాసనమును అనుష్ఠింపుము! నా రాజ్యమం దెచ్చటను, యజ్ఞయాగములేవియు జరుగరాదు; కల్పిత దేవ నిలయములైన గుళ్లు గోపురములు తలయెత్తకూడదు; మఠములు పీఠము లుండరాదు; వానికి గల మడిమాన్యములు ప్రజా సౌకర్యమున కేర్పరుపవలయును; మత గ్రంథము

లెల్ల వెతికి దగ్ధము గావింపలయును. మరియు-ఎల్లెడ సర్వనమభావము గల స్వతంత్ర జీవిత విధానము తక్క- అన్యమగు ఐహిక, ఆముష్మిక శేషజము లుండరాదు.

సేనాని—(ముఖము పాలిపోవును) చిత్తము!....కాని పురాణ బోధనాలయములు, గురుకులములు, భజన కూటములు, ఈ నూతన శాసనము క్రిందకి....

హిరణ్యకశిపుడు—(సేనానివంక జూడకుండనే) ఇంకను సందేహమా? సేనాని—చిత్తము! ప్రభుశాసనము పూర్తిగ అర్థమయినది.

హిరణ్యకశిపుడు—(సేనాని ముఖమును పరికింపకుండనే) యివన్నియు తీరిన పిదప చేయవలసిన ముఖ్యకార్యము: ప్రజలెల్లరు దీర్ఘకాలమునుండి మతము పేరిట, దేవుని పేరిట గురువులుపదేశించిన కథలకు మంత్ర ముగ్ధులై యుండుటచే ఈ శాసనముచే కొలది భీతిల్లగలరు. కాన వారి భయము తొలగుటకు, సర్వ ప్రజ సమత్వ విజ్ఞానప్రాప్తికిని నా నూతన గ్రంథమును కోట్లగ ప్రతులు వ్రాయించి జన సముదాయమునకు పంచి పెట్టింపుము. పిదప, ఈ విప్లవము నన్నిదేశముల వ్యాపింపజేయవలసి యున్నది. మతభ్రాంతులగు ఇతరరాజులపై దండెత్తి జయించిన గాని వారి రాజ్యములం దీ క్రాంతి కల్యాణము సంఘటింపజేయలేము ఈలోక కల్యాణ కారకమగు విశ్వసమరమునకు వలయు సమస్త సన్నాహములు చేయింపుము.

[మంత్రితో] శాసనపత్రములను వెంటనే తయారుచేయుము (ప్రస్థానము.)

మంత్రి—అయ్యో! రానున్న దెంతటి ఘోరవిప్లవము.

పురోహితుడు—సేనాని! పీ పీ ప్రళయ వర్తనమునకు నటరాజ ప్రధాన శిష్యుడ వయ్యోదవా?

పేనాని—నేను సార్వభౌముని శాసనమునకు బద్ధుడనుగదా?

పురోహితుడు—(హతాశుడై దుఃఖముతో) అయ్యో! ఇంకేమున్నది! సర్వనాశనమయిపోయినది, దేవుడు లేడు!....మతముకల్ల!.....గురువు మోసము! దేవళము వ్యర్థము!....పౌరోహిత్యము పనికిమాలిన బేరము! ఎట్టి ప్రళయకాలము రానున్నదో! దేవునితో, మతముతో నేటివరకే మనకు సంబంధమేమో!

తెర

.....

మూఢవరంగము

[ప్రొద్దున. దాదాపు తొమ్మిది గంటలవేళ. దేవాలయములో గర్భగుడి: మిణుకుమిణుకుమను ప్రమిద దీపములు, అంధకారమును ద్విగుణము చేయుచుండును. విగ్రహమునకు ముందున్న అగ్నిగుండములో వేసిన సుగంధ ద్రవ్యముల ధూమపుంజములు దేవాలయము నంతయు వ్యాపించి యుండును. అగ్నిగుండము చుట్టును శుక్రాచార్యులు, ముగ్గురు ఋషులు యుందురు. నిశ్శబ్దం]

శుక్రాచార్యులు ఓం! ఓం! ఓం!

అందరు—ఓం! ఓం! ఓం!

శుక్రాచార్యులు—మనలో నెవ్వరు ప్రస్తుత విషయముల ఎరుగనివా రుండరవి నా అభిప్రాయము.

అందరు—మాకెల్లరకును విదితమే.

శుక్రాచార్యులు—హిరణ్యకశిపుడు తలపెట్టినది మహా విప్లవము.

అందరు—అగును.

శుక్రాచార్యులు—ఆ విప్లవము ప్రధమోద్దేశ్యము సర్వమానవ సమత్వము.

అందరు—సర్వ మానవ సమత్వమా!

శుక్రాచార్యులు—దానికి ప్రధమ సోపానము భగవదాస్తిక్య ఖండనము.

ఒకఋషి—ఓరిపాపీ! పాషండా!

రెండవఋషి—దుర్మదాంధా! నాస్తికుడా!

మూడవఋషి—మతద్రోహీ! కులాంగారమా!

శుక్రాదార్యుయి—వినుడు. రెండవది మత విధ్వంసము. అందుచ మన వైదికమత నిర్మూలనము.

అందరు—(క్రోధముతో) ద్రోహీ! వైదికమత విధ్వంసమా!

ఒకఋషి—విప్లవమా వాడు చేయునది?

శుక్రాచార్యులు—ఇది యంతయు మీకు సమ్మతమేనా?

ఒకఋషి—సమ్మతమా! ఎంతమాట! దైవద్రోహము నుద్దేశించిన యీ తదింకను జీవించి యున్నందులకు నాకు పట్టరానికోపము కలుగుచున్నది. వానిపేరు తలచినంత నా యెడలు మండిపోవుచున్నది.

రెండవఋషి—ఈతని వ్రతుకనిచ్చిన లోకముల నాశనముచేయును.

శుక్రాచార్యులు—వృధా కోపముతో గంతులు వేయనేల? కార్యమును గూర్చి యాలోచింపుడు.

అందరు—అగునగును!

ఒకఋషి—కర్తవ్య మాలోచింపుడు.

రెండవఋషి—తడవు సేయ వీలులేదు.

శుక్రాచార్యులు—ఈ విప్లవము ముట్టించి రగుల్కొల్పగల కార్చిచ్చు.

ఒకఋషి—కార్చిచ్చేమి? వాని ప్రతిభ చిచ్చుల పిడుగుగా నున్నది. వాడు పాపదగ్ధుడు.

శుక్రాచార్యులు—వాని విప్లవముచే ప్రథమమున జనులు మతదూరులయి, దైవ విశ్వాసహీనులయి, పాషండులయి, నరక కూపమునం దొక్కసారి కూలుదురు. బ్రాహ్మణులు, పురోహితులు, అర్చకులు అన్న గౌరవము లోపించి, వారి ఎడ నిరసనము ద్వేషముకూడా సంభవింపగలదు. అందుచే వారల సన్మానించి, దేవతలను తృప్తిపరచి; సూక్ష్మముగ మోక్ష మునందు మహాభాగ్యమును ప్రజలు గోల్పోవుదురు. ఇది ప్రళయమునకు దారి తీయును.

ఒకఋషి—(ఆలోచించి) పురోహితులకు, మతగురువులకు పలుకుబడి కొంత కొరత వడును.

రెండవఋషి—ఇక వీనిని నాశనము చేయుటకు జాగుసేయరాదు ఆల స్యాత్ అమృతం విషం: ఋభళ్య శీఘ్రం.

శుక్రాచార్యులు—వీనిని విధ్వంసము చేయవలెను.

ఒకఋషి—వైదిక మతమును ధ్వంసము చేయబూనిన వీనిని మట్టు పెట్టక పూజింతుమా।

శుక్రాచార్యులు—పిదప హిరణ్యకశిపుడు చెప్పినదేమన ఐశ్వర్యమంతయు దేవళములం దూరక మూల్గుచున్నది ప్రజల కందుచే నిరుపేదతనము కలుగుచున్నది. లోకము దుఃఖమయ మగుచున్నది.

ఒకఋషి—(కోపముతో। దేవళములందు ధన ముండరాదా?

రెండవఋషి—దైవమునకు కానుకలు సమర్పించి, ఆకలిదప్పుల కదలి క్షణభంగుర దేహమును బాసినను, భక్తులకు శాశ్వత మోక్షము లభించు నను జ్ఞాన మీ హిరణ్యకశిపునకు కలుగకుంట కడుశోచనీయము.

మూడవఋషి—వాడు పరమ మూఢుడు గదా?

శుక్రాచార్యులు—వాని సిద్ధాంతమున మోక్ష మనునది లేదట.

ఒకఋషి—వీని మూఢత్వమునకు మితిలేకున్నదే! దైవము, మతము, మోక్షము, అన్నియు మిథ్యేనా?

రెండవఋషి—కేవలము మ్లేచ్ఛునివలె నున్నాడు.

మూడవఋషి—వలెనేమి, మ్లేచ్ఛుడే వాడు.

శుక్రాచార్యులు—ఋషులకు తపోబలము లేదట। బలము లేకయే రాజుల సాయమున కార్యసిద్ధి నొందిరట।

ఒకఋషి—ఏమి వాని కిందకావరము? కాపదగ్గు నొనరింపనా?

శుక్రాచార్యులు—ఎట్టి వెర్రి? తపోబలము తపశ్శాలినిపై పనిచేయ

గలదాఁ ఋన మంత్రములు వానిని బాధింపవు. వానిని వేరొక మార్గమున—

ఒకఋషి—వానిని సంహరించి దైవమతముల ప్రతిష్ఠ నిలఁపుభారము మనమీద నున్నది.

అందరు—అగును!

శుక్రాచార్యులు—దైవ మత విధ్వంసకుని హత మొనర్పవలయును.

ఒకఋషి—తక్షణమే హత మొనర్పవలయును.

అందరు—హతము! హతము!

శుక్రాచార్యులు—తన సేనాపతికి వాడు మతాధికముల వ్రేళ్లతో పెకలించి వేయ నాజ్ఞ నొసంగినాడట.

ఒకఋషి—ఇక విలంబనము కూడదు.

రెండవఋషి—హిరణ్యుని వధకయి వలయు సర్వకార్యముల జేయుట కొరకు ఆచార్యులే సమర్థులు.

అందరు—నిజము! నిజము!

ఒకఋషి—ఈతనికి వలయు సాయముచేయు బాధ్యత మనయందరిది

శుక్రాచార్యులు—సరి. ఆ విషయమంతయు నే జూచుకొనియెద. కాని ఒక్క-మాట....[నిశ్శబ్దము] మన మంత్రాలోచన బ్రహ్మకయినను తెలియ రాదు. సర్వము ఋహా రహస్యముగనే యుంచవలయును. * * * మనలో గుట్టు బయలొనర్చిన ద్రోహి శిరము శతధా ఛిన్నమగుత!

అందరు—తథాస్తు.

ఒకఋషి—అతడు దైవమత ద్రోహమొనఁగించిన పాపమున్ మోసను. రౌరవాది నరకముల బడును.

అందరు—తథాస్తు.

[అందరు విలచి బద్ధంజలులై నిమీలితనేత్రు లగుదురు: నిశ్శబ్దము]

శుక్రాచార్యులు—ఇక మీరు దయచేయుడు.

[ఋషులందరు ఒకరి తరువాత నొకరు నిష్క్రమింతురు. శుక్రాచార్యులు అటునిటు పదారుచేయుచుండును. కొంతసేపు నిశ్శబ్దము. ఇంతలో మందగానము తరంగాయిత మగును.

"గోవిందం భజ గోవిందం భజ మూఢమతేః"

శుక్రాచార్యులు—ఏమదిఃనారదునిపలె నున్నాడు....ఇదుగో సమీపించి నాడు కూడను. [ధ్వనివంక జూచి] నారదాఃనారదాఃనారదాఃన

నారదుడు—రెండవదా? నేను పరదేశిని. వచ్చి ఎంతో తడవుకాలేదు. దీని గొడవ నాకేలయని—

శుక్రాచార్యులు—ఇది కేవల మొక్క దేశమునకు సంబంధించినదికాదు. సర్వ లోకములకు సంబంధించిన ముఖ్యమగు విషయము పమాదేశ మున పాల్గొని యుండవలసినది. మరచితిని, నీవు మాతో కలసిన ద్వార రక్షణము చేయువారెవరు? మంచి పనియే జేసితివి.

నారదుడు—ఇందు మించిపోయిన దేమియును లేదు. అంతయు నేను వింటిని....సత్వర సంహారమేనా చేయవలసినది? గత్యంతరము లేదా?

శుక్రాచార్యులు—లేదు. నిశ్చయముగ లేదు.

నారదుడు—సంహారక్రియా నిపుణు డెవరు?

శుక్రాచార్యులు—ఇది ఆవశ్యక ధర్మము. ఆపద్ధర్మము లాచరించు పట్లి జంకు గొంకులు తగవు. ముందంజ వేయువానికి సామర్థ్య మదియే వెంటాడును.

నారదుడు—సంహార మంత ఆవశ్యకమా?

శుక్రాచార్యులు—నారదా! ఎమియు తెలియని వానివలె మాటలాడు చున్నావు. ఆరు సంవత్సరములు తపమాచరించి తుదకు దైవ మత విధ్వంసమునకై పెద్ద క్రాంతిని జగమంతయు కల్పింప హిరణ్యకశిపుడు సంకల్పించినాడు. ఇక వానిని తుదముట్టించు విషయ మాలోచించుట కవకాశ మెక్కడిది?

నారదుడు—అయినచో నా వచ్చిన పని ముగిసినది. నే పోయెదను.

శుక్రాచార్యులు—నీ వచ్చిన పని చెప్పవయితివే?

నారదుడు—మరేమియు లేదు. ఇంద్రుడు, హిరణ్యాదు ఇతర దేశము లపై దండెత్త సన్నాహము చేయుచున్నాడో లేదో గుట్టు తెలియ నన్ను

వేగుల వానిగ బంపెను. క్రాంతి సల్పు యత్నమున నున్నవా డేమి యుద్ధము చేయగలడు? వాని ప్రయత్న సిద్ధికి పూర్వమే మీరే వానిని హతము చేయబూనినపుడు నేనిక శ్రమ పడవలసిన దేమున్నది.

శుక్రాచార్యుడు—అట్లు కాదు. హిరణ్యు నొకసారి దర్శించి రమ్ము.

నారదుడు—ఇప్పు డేమంత యవసరము?

శుక్రాచార్యుడు—అతని చిత్తవృత్తి నెరింగి, మాకొకింత తోడ్పడ వచ్చును. వీ వీ ప్రాంతీయుడవు కావు. ఈ దేశీయుడవు కావు; దేవేంద్రుని రాయబారిగ హిరణ్యుని దర్శించిన, నిన్ననుమానించు వారుండరు.

నారదుడు—మీ సాయమున కెన్నడును సిద్ధుడనే. మత విధ్వంసకుని సంహార లీలలో నా చేతులుకూడ కలుపనిండు. నేనిపుడు చేయవలసిన దేమి?

శుక్రాచార్యులు—తర్వాత మాట లాడెదము. ఇప్పు డిచటినుండి విరమింతము.

(ఇద్దరు నిష్క్రమింతురు)

తెర

.....

నాల్గవరంగము

(వాడాపు 10 గంట లౌను. లీలావతి మందిరము. ప్రవేశము: లీలావతి; చెలికత్తె రాగమంజ. లీలావతికి ముప్పది సంవత్సరములు. లీలావతి పట్టాని సంతోషముతో కూనరాగములు తీయుచు, అటు నిటు తిరుగుచు నడుచు నడుమ మాటలాడుచు, చెలికత్తెయ సవరించిన వానినెల్ల మరల మరల సర్దుచుండును.)

చెలికత్తె—అమ్మా!

లీలావతి—ఏమి?

చెలికత్తె—ఇటు చూడుడు పుల్లెపూలతో నింపిన పీఠమును జూపును.)

లీలావతి—తోటలలో పూచిన మల్లెపూల నన్నింటిని తెచ్చి నిరజిమ్మినను అభ్యంతరములేదు. రాజుగారికి మల్లెలన్న కడు ఇష్టము.

చెలికత్తె—ఏమి! ఇంకను వలయునా!

లీలావతి—మరికొన్ని తెప్పింపరాదా!

చెలికత్తె—సరి! (నిష్క్రమించును.)

(లీలావతి పాడుచు సంతోషమున గదియంతయు తిరుగుచుండును.)

లీలావతి—ఎంత సేపాయెనబ్బా! ఇంకను రాదేమి?

(ప్రవేశము: చెలికత్తె)

చెలికత్తె—అమ్మా!

లీలావతి—మల్లెలేవి?

చెలికత్తె—మల్లెలు తెత్తును. ఇప్పుడే శుక్రాచార్యులవారు దయచేసినారు. తమతో ప్రత్యేకముగ నేదో యవసర విషయమునుగూర్చి మాటలాడ వలయునట.

లీలావతి—సరే. వారి నిట ప్రవేశపెట్టించి, పుల్లేపూలు త్వరితముగ తెప్పింపుము. వారు వెడలిపోవునంతదనుక మరెవ్వ రిటకు రాకూడదు. తెలిసినదా?

చెలికత్తె—సరి! (నిష్క్రమించును)

(ప్రవేశము: భయమును గొలుపు అరుణరాగ రంజితమయిన ఏకాక్షితో శుక్రాచార్యులు)

శుక్రాచార్యులు—లీలావతీ!

లీలావతి—ఆచార్యా: నమస్కారములు: దయచేసి....

శుక్రాచార్యులు—(కోపముతోనే) లీలావతీ!

లీలావతి—ఏమి? ఇంత కోపమును జెందియున్నారు?

శుక్రాచార్యులు—కోపమా, ఒడలు మండిపోవుచున్నది. లీలావతీ, నీవు మహా పతివ్రతవుగాన మహాఋషుల దివ్యసందేశమును దెలుప నే నిటకు వచ్చితిని.

లీలావతి—సందేశమును నెమ్మదిగ తెలియజేయ వచ్చును. ముందు దయచేసి పీఠ మధిష్ఠిం—

శుక్రాచార్యులు—వైదిక మత విధ్వంసకుని గృహమునం దడుగిడుటయే మహాపాతకము. ఆపైన పీఠ మధిష్ఠించుట గూడయునా?

లీలావతి—వైదిక మత విధ్వంసమా? ఏ మట్లనుచున్నారు.

శుక్రాచార్యులు—ఇదే కాదు. దైవ ద్రోహమునూ.

లీలావతి—దైవ ద్రోహమా? ఏమది? ఆచార్యా! నాకేమియు నర్థ మవుటలేదు.

శుక్రాచార్యులు—లీలావతీ! నీ కిటకను తెలిసినట్లు లేదు. నీ భర్త ఆరు సంవత్సరములు తప మాచరించి, విప్లవ మొనరించుటకు మదోన్మత్తుడై

నగరమునకు తిరిగి వచ్చియున్నాడు. సత్యమును తాను సాక్షాత్కరింప జేసుకొనెనట। దేవుడు లేడట। మతము పురోహితాదులకై ఏర్పరుప బడిన వంచనమట। దేవుని మతమును తాను రూపుమాప కంకణము కట్టెనట. లీలావతీ। నీకిదే ఋషి వాక్యములు తెల్పుచున్నాను. ఈవిప్లవ సంకల్పమున నీ భర్త ప్రచండాగ్నిలో శలభమువలె భస్మమగును। పెనుతుపానులో కొండను తగిలిన నౌకవలె ఛిద్రలై పోవును। వజ్రపాత మునకు గురియైన సౌధమువలె బుగ్గియైపోవును....ఇక నీకు తెల్పవల సిన దేదియును లేదు. ఋషివాక్య ప్రకార మీనాడే వాని వినాశము. ఏనాడత డీవిప్లవ సంకల్పమును ఆచరణలో పెట్టనెంచెనో, మతద్రోహి యగు నాతని కానాడే చావు మూడినది. మహా పతివ్రతవుగాన నీకు ముందుగా తెల్పితిని. పోయివచ్చెద. (నిష్క్రమించును.)

లీలావతి—(నోట మాటలేక ఘూర్ణిల్లిపోవును. కొంత తడవయిన పిదప) నా నాథుడు. నా హృదయేశ్వరుడు. నా కానంద మయమని తల చిన నేడీ! .....అబ్బా!

(కేకవేసి మూర్ఛపోవును.)

తెర

,,,,,,,,,

ఐదవరంగము

[10 గంటలవేళ. రాజభవనమున యొక గుప్తమందిరము మంత్రి, రాజపురోహితుడు గూఢచారులుగ ప్రవేశింతురు.]

మంత్రి—అవును : ఈ ఇక్కట్టునుండి తప్పించుకొను మార్గ మెద్ది?

పురోహితుడు — ఒకటి కలదు.

మంత్రి—ఏమది?

పురోహితుడు—రాజును చంపుట.

మంత్రి—(తుళ్లిపడి) ఏమి?

పురోహితుడు—రాజును చంపుట కష్టమేగాని, లేకున్న విప్లవము నణచుట అసంభవము

మంత్రి—అనగా?

పురోహితుడు— ఒక్కసారి రాజు మాటల యందలి సత్యమును ప్రజలు గుర్తెరింగిరేని, విప్లవము తానై చెలరేగును. రాజు నడుప పనియుండదు. గట్లు త్రెంచుకుని వెల్లువలై పారు మహానదివలె ప్రజలయందది వ్యాపించును. అప్పు డేది దాని కడ్డువచ్చినను విధ్వంస మయిపోవును. కాన ప్రజలయం దీ నూతన జ్ఞానము వ్యాప్తికాక పూర్వమే గిల్లివేయుట మంచిది. లేకున్న గొడ్డళ్లతో నరకవలసి వచ్చును. కాన వెంటనే రాజును తుదముట్టించి మతాచార్యుల ప్రతిష్టను నిలువబెట్టుకొనదగును

మంత్రి—రాజును చంపుట సాధ్యమా?

పురోహితుడు—'సాధ్యమో' 'అసాధ్యమో' చంపకున్న వేరు మార్గము లేదు.

మంత్రి—నిజమే. కాని రాజద్రోహము పాపముగదా?

పురోహితుడు—దైవమత విరోధియగు రాజును జంపిన రాజద్రోహ పాపము మనల జుట్టుకొనదు.

మంత్రి—అదెట్లు?

పురోహితుడు—దైవమత విరోధిని జంపిన పుణ్యము, రాజద్రోహ పాతకము కంటె శతగుణాధికము.

మంత్రి—సరియే. కాని ప్రాణ సమానముగ ఆదరించు రాజును మనము సంహరించిన ప్రజలు తిరుగబడరా?

పురోహితుడు—అది మన చేతిలోని పనియే!

మంత్రి—ఎట్లు?

పురోహితుడు—ప్రజలకు మతిలేదు. రాజు చేయునది వారి మంచికొరకే యగు గాక. దైవ మతములన్న వారికి భయ భక్తులు మెండు. దైవమే స్వయముగా అవతార రూపమున వచ్చి హిరణ్యుని జంపెనని నమ్మింప జేయవచ్చును. పిదప నంతయు సులభమే.

మంత్రి—అవును, మానవుడు సహజ భీరువు, వాని కర్థము కానిదెల్ల వానికి భయమును పుట్టించును!

పురోహితుడు—మానవునకు సహజ భీరుత్వమే లేకున్న మతాచార్యుల బూటకములన్నియు నెగ్గునా? హ! హ! హ! ఇక మన కార్యమును గూర్చి యాలోచింపుడు.

మంత్రి—(ఆలోచించి) హిరణ్యుని జంపిన, ప్రహ్లాదుని మన పక్షమున జేర్చుకొన వలయును. అపుడంతయు చాల సులభము.

పురోహితుడు—ఆచార్యులను అదియే తెలిపిరి.

మంత్రి—తరువాత సేనానిని సైతము మనలో గలుపుకొనవలయును. ఇది యెంతేని యవసరము

పురోహితుడు—ప్రస్తుత మాచార్య్ లా పనియందే యున్నారు.

మంత్రి—తండ్రిని జంపిన తక్షణమే ప్రహ్లాదుని సింహాసన మెక్కించిన, మనల ననుమానించు కొద్దిమంది కూడ మనతో నేకీభవించగలరు. అప్పటికి అనుమానించువా రున్న సేనాపతి సాయమున వారి నణగ ద్రొక్కవచ్చును.

[ఆలోచించి] కాని ప్రహ్లాదుడు తన తండ్రిని జంప నీయకొనునా?

పురోహితుడు—ప్రహ్లాదుడు శుక్రాచార్య్ల శిష్యుడు. తన శిష్యుడు తన్నెపడు జవదాటడని ఆచార్య్ల నమ్మిక. సేనాపతి కూడ ఆయన చేతిలోని కీలుబొమ్మే.

తమ యభిమత మెట్లున్నదో తెలియ గోరినారు. తమరు మా కనుగుణ్యులే. కడు సంతసము....ఇక....సెలవు.

మంత్రి—నా విషయమై సందేహింప బనిలేదు. దైవ మతము లారిపోవు సమయమున విప్లవ ప్రియుడగు రాజును ముద్దుపెట్టుకొను మూర్ఖుడుండునా?

పురోహితుడు—చిత్తము.

[ఇద్దరు విరు దెసల నిష్క్రమింతురు]

••••••••

ఆరవరంగము

[11 గంటల వేళ. సేనాపతి మందిరము. సేనాపతి కూర్చొని ఆలోచించుచుండును. అతని నుదుటనున్న స్వేద బిందువు లాతని మనోవ్యధను చాటుచుండును. ప్రవేశము శుక్రాచార్యులు. సేనాపతికి గురుపద ధ్వని వినరాదు]

శుక్రాచార్యులు—(మంద స్వరమున) విక్రమసేనా! (గొంతెత్తి) సేనాపతీ! (సేనాపతి త్రుళ్లిపడి చూచును) ఏమి? దీర్ఘముగ నాలోచించుచున్నావు?

సేనాపతి—(చివుక్కునలేచి) ఆచార్యా పరాకుననుంటిని. క్షమింపుము. పీఠమలంకరింపుడు.

శుక్రాచార్యులు—సరి. (కూర్చొనును) ఏమింత దీర్ఘముగ నాలోచించుచున్నావు?

సేనాపతి—(కూర్చొని) గురువులకు తెలియని విషయము లేమున్నవి? ముందుకు బోయిన గోయి! వెనుకకు బోయిన నూయి!

శుక్రాచార్యులు—(చిరునవ్వుతో) ఏమది?

సేనాపతి—ఏమున్నది? రాజొజ్జ నెరవేర్చిన ద్రైవద్రోహము. నెరవేర్చకున్న రాజద్రోహము.

శుక్రాచార్యులు—(నిరసనముగ) సేనాపతీ, నీవు సుక్షత్రియుడవను కొంటిని, లేదు. సాహసము, వివేకము, అభిమానము, ఉగ్గుపాలతో అబ్బిన వీరక్షత్రియుడవు-నీకు సందియములా? తోచి నీయవు.

సేనాపతి—(ముఖము మ్లానమొందును) ఏమంటిరి?

శుక్రాచార్యులు --త్వరపడవలదు. సర్వము తెల్లము కాగలదు.

సేనాపతి---చిత్తము.

శుక్రాచార్యులు--మతము మంటగలసిపోవ నున్నది. అనాదిగ వర్ధిల్లు చున్న తేజోవంతము, మహిమాన్వితము, వైభవోపేతమగు, వైదిక మతము ఒక మానవుని విప్లవమున కాహుతి కానున్నది. విప్లవము లోకము దహింపచేయ నున్నది. మతమును చితినెక్కింప నున్నది. నీవు సుక్షత్రియుడవు। పౌరుషోద్దీపితుడవు। వీరకేసరివి। సైనిక బలమంతయు నీచేత నున్నది. ముందుబోయిన నూయి, వెనుకబోయిన గోయి, అని ఆలోచించుచు వ్యర్థ సందేహములతో నుర్రూగనేల। సర్వ సేనాపతివి। సేనావాహినుల నేవంక బట్టిన ఆవంక ప్రవహింపజేయగలవు. లెమ్ము. వ్యర్థ చింతలమాని కార్యరంగమున దూకుము.

సేనాని---(కోపము నణచుకొనుచు, మీసమును మెలివెట్టుచు) ధైర్యము, క్షత్రియ రక్తమని పలుమారు మీరు హెచ్చరింప నక్కరలేదు. ఈ రాజు తోడియే లెక్కకు మిక్కిలి యుద్ధముల గెల్చితి. నా పేరు విన్న శత్రు రాజులెల్ల వణికిపోదురు. మహేంద్రుడే నా రాక విన్న దుర్గమును వీడి పిక్కబిలము జూపును. శౌర్యము, ధైర్యము నాకొరుల బోధింప నక్కరలేదు. మత, దేశ రక్షణకై ప్రాణంబుల నయిన నొడ్డుటకు సిద్ధముగ నున్నాను కాని క్రోవ కానరాదు. ఏమి చేయుటకు తోచక తికమక పడుచున్న నన్ను పంపయని తూలనాడకుడు.

శుక్రాచార్యులు--(నవ్వి) సేనాపతీ। నీ రక్తమెట్టిదో చూడ నిట్లంటిని. కాని నీవు పందవని నేను కలనయిన తలచి ఎరుగను. ఎన్ని యుద్ధముల, ఎన్ని కష్టతర ఘనకార్యముల నీవొనరించి యుండలేదు। నీధైర్య సాహసములు నాకు తెలియనివి కావు. (ప్రసన్న స్వరమున) విక్రమసేనా। నీకు మతమునం దాసక్తి గలదా।.....దైవభీతి నీకుకలదా।

సేనాని—ఆచార్యా! ఎంతమాట! మతమునందు నాకాసక్తి కలదా, దైవ భీతి నాకు కలదా! మాటలతో చెప్పువాడను కాను. చేతల జూపించువాడ నని నమ్ముడు.

ఈ రెంటికై నా ప్రాణమును, నా సర్వస్వమును సతీ సంతానముతోసహా బలివెట్ట వెనుతీయువాడనుకాను. ఆచార్యా! నా వలన వలసిన కార్య మేదో తెలుపుడు. పరీక్షించి మీరే తెలియగలరు.

శుక్రాచార్యులు—సాధు! సాధు! సేనానీ! విప్లవాగ్ని జ్వాలలు విజృం భింప నున్నవి రాజే యీ విప్లవమునకై సంసిద్ధుడగుచున్నాడు. అన్యు డెవడయిన దీనికి పూనియున్నచో వానిని పిచ్చివానిగ జూటియో, కాక మరియొకతీరున విప్లవమును నిర్మూలింప గలిగియుందుము. కాని.... ఇప్పుడు విప్లవమునకు సూత్రధారణ జేసినవాడు జగత్ విఖ్యాత సార్వ భౌముడగు హిరణ్యకశిపుడు.

సేనాపతి—అగును. అందుచేతనే కష్టము.

శుక్రాచార్యులు—ఇది మావంటి వారికి కష్టముగాని, ధైర్యసాహసములు కలిగి, హిరణ్యు బలము నంతయు నీ యరచేత బెట్టుకొనిన ధీమంతు డవు నీ కొక లెక్కయా! నీకిది లీలామాత్రమే యగును.

సేనాపతి—ఆచార్యా! కార్యమేదో సెలవిండు, వెంటనే దానికి కడంగి నే ప్రాణము గోల్పోవుటో లేక.....

శుక్రాచార్యులు —వెర్రి సేనానీ! మొండి సాహసమున హిరణ్యుని ఢీకొని బలియయిన ఏమి ప్రయోజనము—కావలసినది కార్యసిద్ధి!

సేనాని—ఆలస్యమేల! ఏమి చేయవలయునో చెప్పుడు.

శుక్రాచార్యులు—విక్రమసేనా! ఈ కాంతివాహిని నడ్డుట కొక్కటే మార్గము.

సేనాపతి—చెప్పుడు.

శుక్రాచార్యులు—ఇంక నీవు నా కాప్తుడవు ; నా యనువర్తివి. హిరణ్య కశిపుడు నీకింక రాజు కాజాలడు.

సేనాపతి—కొలువు నీ నాదే త్యజించెదను.

శుక్రాచార్యులు—త్యజించెదవు—కాదు—త్యజించితివి ; నీ వింక నా యాజ్ఞాను వర్తివి.

సేనాపతి—రాజునకు ఈ విషయము సూచననైన నీయవలదా?

శుక్రాచార్యులు—నీ మతమును విధ్వంసము చేయ ఏనాడు క్రాంతి సంకల్పించి భ్రష్టుడయ్యెనో, ఆనాడే వాడు "నా విష్ణుః పృధివీపతే" యను సూక్తిని సార్థకము చేయజాలని వాడౌటచే రాజత్వమునకు దూరుడయ్యెను. అట్టి వానితో నీ పింక ఏమియు నివేదింప బనిలేదు. నీవింక నా యనుచరుడవు.

సేనాపతి—చిత్తము.

శుక్రాచార్యులు—ఇక వినుము. సంహారము చేయుటే అవశ్య కర్తవ్యము: సిద్ధపడుము: హిరణ్యుని వధింప వలయును.

సేనాపతి—ఆఁ ! ఆఁ ! అంతటి ఘోర చర్యయా?

శుక్రాచార్యులు—అన్య మార్గము యేమియు లేనపు డేమిచేయుట? వాడు సింహాసన మెక్కి-యున్నంతవరకు, రాజబలముతో, సింహాసనాధికారముతో ఇనుమడించిన ఉత్సాహముతో, విప్లవ వాహినిని దేశమంతటను ప్రవహింపజేయును. రాజదండము నూతగా గొని దైవ మతముల యందు విశ్వాసాదరము లడుగంటచేయును, సమస్త మానవుల భ్రష్టుల చేయును. కాన ఆలోచించు తరుణము మిగిలినది. ఇక కార్య శూరత్వమునకే వేళ—లెమ్ము. సత్వర సంహార క్రియకు కడగి, మతమును, నిన్ను, నన్ను ఎల్లర రక్షింపుము.

సేనాని—[సందేహముతో తికమక పడును] రాజవధయా?....సత్వరమే?

శుక్రాచార్యులు—కాదు, రాక్షస వధ. సత్వరమే!

సేనాని—ఆచార్యా....హిరణ్యకశిపుడు....మనరాజుకదా!

శుక్రాచార్యులు—[తత్తేజితుడై] విక్రమసేనా! నీవింతటి మృషావాది వనుకొనలేదు. ఆదినమాట తప్పువాడవని ఎంచలేదు. కార్యాచరణకడ వెనుకంజ వేయువాడవని తలచలేదు. హిరణ్యు డన్న నీకింత భీతి యని....

సేనాని—ఆచార్యా, కోపగింపకుడు: కోపగింపకుడు....సింహాసనము నధిష్ఠించిన మనరాజుకు, పరమ మిత్రుడను అగుటచే యాతని వధ యన్న నా యొడలు కొలది కంపించినది. అతడన్న నా కావంతయును భీతిలేదు.

శుక్రాచార్యులు—[ఈరడిల్లి] మతముల నెల్ల నాశము చేయనెంచిన కుటి లాత్ముడు, పాషండుడు సింహాసనము నధిష్ఠించిన నేమి, స్వర్గమున కధి పతియైన నేమి? దైవ విరోధి రాజయిన నేమి? మహాఋషియైన నేమి? అత డెన్నటికిని వధ్యుడే!

సేనాని—[వినయముగా] ఆచార్యా! తమ భృత్యుడను. నాకు సందేహ ములు లేవు. తమ యాజ్ఞ శిరసా వహింతును.

శుక్రాచార్యులు—విక్రమసేనా! నీవూరక సందేహింప బనిలేదు. దైవమే నిజముగ అతనిని సంహరించి తన యునికిని మతమును నిలబెట్టు కొన గలడు. కాని నిన్ను నిమిత్తమాత్రునిగ నుంచ, నీకును, నీ వంశము నకును, నీ పితరులకును శాశ్వత మోక్షము నీయదలచితిని. ఇంకను కాలము మించలేదు. బాగుగ నాలోచించుము.

సేనాని—దైవమే యాతని నేల సంహ....

శుక్రాచార్యులు—ఛీ! ఛీ! భీరువా! నీకు రోషములేదు. పౌరుషములేదు.

నీయందు పొరుపడి వేడిరక్తము కాదు, బురదనీరు. మానవ సంకల్పమున దేవుడుండి లీలల జరుపుగాని, తానై యాచరించునా?

సేనాని—ఆచార్యా! క్షమింపుడు; కోపగింపకుడు. నేను మీ యాజ్ఞలకు బదుడను.

శుక్రాచార్యులు— త్వరలో నీవు చేయవలసిన కార్యమును తెలియబరచెదను. వేచియుండుము. [లేచిపోవుచుండును]

సేనాని—[గొణుగుచు, సన్నని స్వరమున] నా రాజును, నా యాప్తుని, నా మిత్రుని చంప నా చేతులెట్లాడును?

శుక్రాచార్యులు—[సేనాని గొణుగుడువిని, వెనుకకు తిరిగి కోపమున ఒడలు కంపింప] తుచ్ఛుడా! ద్రోహీ! నీ రాజు కొరకు, నీ మిత్రుని కొరకు, సర్వలోక జీవ సంతరణ సాధన మయిన, పరమ పావన మయిన మతమును మంటగలుపుదువా?

సేనాని—ఆచార్యా! క్షమింపుడు. మీకేల? మాట యిచ్చితిని గదా!

శుక్రాచార్యులు—సరి, నిన్ను నమ్మెచున్నాను. (వడిగా నిష్క్రమించును)

సేనాని—(ఆలోచించుచుండును) ఒక స్నేహితునికొరకు, ఒక తుచ్ఛ ప్రాణికొరకు శాశ్వతంబును ఆచంద్రతారార్కంబును అయిన మతమును మంట కలుపుదునా?

తెర

♦♦♦♦♦♦♦♦♦

ఏడవరంగము

(11 గంటల వేళ. లీలావతి మందిరము. అంతయు చిందర వందరగా నుండును. మల్లెపూలు వాడి ఎల్లెడ విరజిమ్మి యుండును. లీలావతి మూర్ఛదేరి యుండును. చెలికత్తె రాగమంజరి శిరోపచారములు చేయుచుండును. ప్రసన్న వదనముతో ప్రహ్లాదుడు ప్రవేశము. ప్రహ్లాదుడు 18 లేక 17 ఏండ్ల వాడు)

ప్రహ్లాదుడు—అమ్మా! (లీలావతిని జూచి) ఏమిది?

(లీలావతి దుఃఖముతో మాట్లాడలేక ప్రహ్లాదుని వంక జూచుచు కన్నీరు గార్చును)

ప్రహ్లాదుడు—అమ్మా! ఏమిది? ఇట్టి సంతోషదినమున నీకీ సంతాపమేల?

లీలావతి—సంతోషదినమా? విషాద దినము నాయనా యిది.

ప్రహ్లాదుడు—ఏమి మాటలమ్మా ఇవి?

రాగమంజరి—నాయనా! ప్రహ్లాదా! నీ తల్లి కడు విషాదవార్త విన్నది; ఈ స్థితికి వచ్చినది.

ప్రహ్లాదుడు—విషాద వార్తయా! తండ్రి క్షేమమే గదా?

లీలావతి—ఆఁ! తండ్రికే మూడినది. నీ తండ్రి హిరణ్యకశిప భూపాలు డింక మనకు దక్కడు.

ప్రహ్లాదుడు—నా తండ్రికి ప్రాణహానియా? ప్రజాక్షేమమునకయి ఆరు సంవత్సరములు తపమాచరించి నేడే యేతెంచిన నా తండ్రికెట్టి విపత్తు. అమ్మా! ఎట్టి దుర్వార్త!

లీలావతి—ఈ యారు సంవత్సరముల తపమే నీ తండ్రికి చేటు గూర్చినది.

ప్రహ్లాదుడు—అయ్యో! ఎట్టి విపరీతము! తపశ్చర్య కీడున కాలవాలమా!

లీలావతి—నాయనా! పిన్నవాడవు, నీకేమి తెలియును!

ప్రహ్లాదుడు—అమ్మా! అంతయును చెప్పుడు. భగవంతుడున్నాడుగదా, అనపరాధియైన తండ్రిని రక్షింపడా!

లీలావతి—దైవము తన విరోధికి సాయముచేయునా? ఏమిమాటలా వెర్రి తండ్రీ!

ప్రహ్లాదుడు—అమ్మా! ఇక నే నమ్మకూడాలను. ఆరు సంవత్సరములా తపమాచరించిన తపస్శాలి పవిత్రుడయి, మరింత దృఢమయిన భగవత్ భక్తుడగును గాని....

లీలావతి—ప్రహ్లాదా! ఏమి చెప్పుదును. [దుఃఖముచే మూర్ఛపోవును]

ప్రహ్లాదుడు—అమ్మా! అమ్మా! [త్వరపడును.]

[రాగమంజరి ఉపచారము చేయ యత్నించును, ప్రహ్లాదుడు వెర్రివానివలె అటు నిటు తిరుగుచుండును]

నా తల్లి విన్న దుర్వార్త ఏమయియుండును? అబ్బా! ఎంతవేదన!.... ఎంతవేదన! [పరిచారికతో] చల్లనినీరు—త్వరగా! [తల్లి శిరమును ఒడియందుంచుకొని కూర్చుండును. పరిచారిక నిష్క్రమిణ. తెరలో మంద గానము క్రమముగా సమీపించును. ప్రహ్లాదుడు మైమరచి సంగీతము నాలించ గడగును]

ప్రహ్లాదుడు—ఎట్టి కోకిల కంఠము [తెరలో నారద విస్పష్టగానము "గోవిందం భజే"] ప్రవేశము: నారదుడు.

ప్రహ్లాదుడు—మునివర్యా! నమస్కారములు.

నారదుడు—[ఆశీర్వదించును] ఆయురారోగ్యైశ్వర్య సిద్ధిరస్తు! [లీలావతిని జూచి] కుమారా ఏమిదీ!

ప్లాదుడు—మూర్ఛపోయినది—కారణము తెలియదు. దుఃఖవార్త ఏదో

విన్నదట: నా తండ్రికేదో ముప్పు వాటిల్లునని ఎవరో చెప్పిరట: నాకది తెలుపబూని దుఃఖముచే మూర్ఛిల్లినది.

నారదుడు—ఉపచారము లేమయిన చేయింప రాదా:

ప్రహ్లాదుడు—జలమున కయి పోపుదే బంపితిని.

నారదుడు—[లీలావతి నాడి పరీక్షించి, తృప్తిజెంది] సరి: ఆ వార్త ఏదియో తెలిసికొంటివా:

ప్రహ్లాదుడు—లేదు: నాకది తెలుప బూనియే....

[పరిచారిక జలముతో ప్రవేశించును. నారదు డా జలమును లీలావతి ముఖముపయి జిలకరించును. లీలావతికి స్మృతి వచ్చును]

లీలావతి—[నిట్టూర్పు విడచును] అబ్బా: ఎట్టివేదన: ఎట్టి ఘోరవార్త: [నారదుని జూచి] నారద మునీంద్రా: నమస్కారములు. [రాగ మంజరి నిష్క్రమించును]

ప్రహ్లాదుడు—నారదులా మీరు: మహాత్మా: అయిన పునర్నమస్కారములు.

నారదుడు—లీలావతీ: నీ వీ నాడు దుఃఖవార్త వింటివట: నా కది తెలియును. దానిని నివారించు నుపాయముగూడ నే నెఱుగుదును.

లీలావతి—[నారదుని పాదముల తాకి] మునీంద్రా: సెలవిండు. పతి భిక్ష దయచేయుడు. నాపతిని రక్షించుటకు దేనినయిన త్యజింప సంసిద్ధను.

ప్రహ్లాదుడు—అమ్మా: ఏమిటా వార్త:

నారదుడు—తల్లీ: లీలా: నీవు మహా పతివ్రతవు. నీవంటివారు నాకు పూజ్యులు. చరణముల వీడుము. నీ భర్త సంరక్షణోపాయమును తెల్పుటకే అనాహూతముగా వచ్చితిని.

లీలావతి—[లేచి నిలుచుండి] పీఠ మలంకరింపుడు. వేగము సెలవిండు.

ప్రహ్లాదుడు—అయ్యా! ఆ దుఃఖ వార్త—

నారదుడు—విడ్డా! అంతయు నే చెప్పెదను. [పీఠముమీద కూర్చొనును]

లీలావతి—ముందు వారించు విధము....

నారదుడు—సత్యము నీయందు, నీ తనయునియందు నున్నది

లీలావతి—నా ప్రాణముల నయిన ఇవ్వగలను.

ప్రహ్లాదుడు—నా తల్లి కొరకు నా ప్రాణముల నైనా విడువగలను.

అమ్మా! ఏమిటా వార్త?

నారదుడు—ప్రహ్లాదా!

ప్రహ్లాదుడు—సెలవిండు.

లీలావతి—అబ్బా! ఎంత ఘోరము!

నారదుడు—నీ తండ్రి ఆరు సంవత్సరములు తపమాచరించి వైదిక మత విధ్వంసమునకై, క్రాంతిని గల్పించుటకు వజ్రసంకల్పముతో వచ్చి యున్నాడు. దైవమత ద్రోహము తలపెట్టినందుకు, ఈ నా డతను హతుడౌనని ఋషులు నుడివిరి.

లీలావతి—అయ్యో! జగదీశ్వరా!

ప్రహ్లాదుడు—హరి! హరీ! ఎట్టి ఘోరము.

నారదుడు—ఈ విపత్తును వారించుట కొక్కటియే దారి. అది నీవల్లను, నీ తల్లివలనను మాత్రమే....

ప్రహ్లాదుడు—నా ప్రాణముల నయిన సమర్పించెదను.

లీలావతి—నా ప్రాణములను సయిత మర్పించెదను.

నారదుడు—ఇంత యేల ప్రహ్లాదా! నీవు భాగవత శిరోమణివి. ఇది లోకవిఖ్యాతము. నీవు నీ శక్తిచే నీ తండ్రిని దైవద్రోహ నిరతి నుండి తప్పించి భగవత్ భక్తుని చేయ సమర్థుడవు. నీవది చేసిన నీ తండ్రి

చావు తప్పును. తల్లీ! నీవు మహాపతివ్రతవు. నీ మాట నీ భర్త జవదాటి లేడని నమ్మిక. నీవతనిని తన సంకల్పమునుండి మరల్చుము. తత్ప్రధికయి కలశారాధన కడులెస్స. [లేచి నిలుచొని] ఇక నేబోయి వచ్చెదను కష్టములు మతిమంతులు చింతింతురా! ప్రహ్లాదా! పోయి వత్తును.

[నిష్క్రమించును.]

[నారదుని గానము "భజగోవిందం" క్రమముగా నస్పష్టయయి మహా వాయువులో లీనమగును. లీలావతి, ప్రహ్లాదుడు అటు జూచుచు నిలచి యుందురు. ఒకింత నిశ్శబ్దత]

లీలావతి—నాయనా! వింటివా! జనకుని రక్షింప బొమ్మ!

ప్రహ్లాదుడు—సరేనమ్మా! న న్నాశీర్వదింపుము.

లీలావతి —[పరాకున] నాయనా, చిరంజీవ పొమ్మ!

ప్రహ్లాదుడు—[తనలో] ఏమీ యాశీర్వచనము! జనకుని రక్షింపబూను నీ యత్నము సిద్ధించు గాక యని ఆశీర్వదింపలేదేమి! ఏమి కానన్నదో జగదీశ్వరా! [నిష్క్రమణ]

లీలావతి—రాగమంజరీ [ప్రవేశము: రాగమంజరి] త్వరగా కలశమును సిద్ధపరుప వలయును,

రాగమంజరి.—సరి [నిష్క్రమణ]

లీలావతి—[దీర్ఘాలోచనలో మునిగిపోవును. నిట్టూర్పులు వదలుచు, వెర్రిచూపులు జూచుచు ఉన్మాదిని వలె మాటలాడు చుండును] అయ్యో, నా భర్తగతి ఏమగునో! * * భగవంతుని ఎడ యీయనకేల యీ ద్వేషము! * * వైదిక మత వైర మీయనకేమి! లోకము మూఢత్వమున మునిగియున్న తనకింత విచారమేల! * * భగవం తుని రూపుమాపనెంచు నెంతటి సాహసము! అబ్బా! అబ్బా! నాహృదయ

వేదన తీరునా? నా నాథుడు నాకు దక్కునా? (కొంతసేపాగి) నారద మహర్షి చెప్పిన రీతి, నా నాథుని రక్షింప వీలగునా? వెళ్లినపుడు నా యభీష్ట సిద్ధికి దీవించనైన లేదా మౌనీంద్రుడు? * * అయ్యో! అయ్యో! జగదీశ్వరా! నా మొరాలకింపవా?—నా నాథుని ఆరు సంవత్సర ముల తపఃఫలము నా దుఃఖమునకు హేతువయ్యెను!! * * (రాగ మంజరి వెళ్లిన వైపుజూచి) రాగమంజరీ! కలశమును సిద్ధపరచితివా? (మరల నాలోచనతో పడును) ఎట్టి దుర్దినము? ఋషివాక్యము లెట్లు శూలములవలె బాధించు చున్నవి?....వారి సంకల్పములు భంగము కాకూడదా? నా అదృష్టము పండకూడదా? అయ్యో నా పతికేల యీ భగవద్వేషము? (ఆలోచించి) తప్పొనరించినంత మాత్రమున మనుష్యుడు, వధార్హుడా? ఎంత కఠినము? ఎంత ఘోరము?—అబ్బా దుర్భరము! (ఆగి) వేషధారులగు నీ ఋషులెంతటి క్రూరులు * * రాగమంజరీ—* రాగమంజరీ! సువర్ణ కలశమును * * (ఒక వేపునుండి రాగమంజరి కలశము పూజా ద్రవ్యము తోడను, మరియొక వేపునుండి హిరణ్యకశిపుడు ప్రవేశింతురు)

హిరణ్యకశిపుడు—లీలా! లీలా!

లీలావతి—(పట్టరాని సంతోషముతో) నాథా! నాథా!

హిరణ్యకశిపుడు—(కలశము జూచి) యిదేమి? ఈ కలశమేల?

లీలావతి—పూజకై.

హిరణ్యకశిపుడు—వెర్రిదానా! పూజ లేమిటి? పూజలు! (చెలికత్తెతో) ఆ కలశమును దూరముగా పారవేయుము.

(చెలికత్తె భయమున వాటి నక్కడ వదలిపోవును.)

హిరణ్యకశిపుడు—లీలా! ఇంత విచారముగ నున్నా వేమి? (లీలావతి హిరణ్యుని చర్యకు దిగ్భ్రమ జెంది కన్నీరుగార్చుచు నిలబడియుండును)

హిరణ్యకశిపుడు.—[లీలావతిని దగ్గరకు జేర్చుకొని] ఇంత విచారముగ నున్నావేమిఁ

(లీలావతి అట్లే మౌనముతో నిలచియుండును) లీలావతీ! నీ దుఃఖము నకు కారణమేమో వచింపుము. నీ దుఃఖముచే, నా హృదయమునకు వేదన గూర్తువాఁ

లీలావతి—మీకు దుఃఖమునాఁ.....నేనాఁ

హిరణ్యకశిపుడు—అయిన ఈ విచారమునకు కారణమేమిఁ

లీలావతి—వైదిక మతమన్న మీకీ పగయేలఁ

హిరణ్యకశిపుడు—నాకు లోక కల్యాణచింతకాక వ్యర్థద్వేష మెవ్వరి యెడ లేదవి యెరుగవాఁ

లీలావతి—అయిన ఈ విప్లవ ప్రయత్నములేలఁ

హిరణ్యకశిపుడు—విప్లవమా! లీలా, దీనిని గూర్చి నీకేల విచారముఁ నీకు తెలుపకుండగ నేనేమయిన నూతన కార్యమును జేయుదునాఁ నా భవిష్యత్ కార్య పరిణామమును గూర్చి నీకు తెల్పుటకే వచ్చితిని.

లీలావతి—క్రాంతి పేరు విన్నంతనే నాకు భయము కలుగుచున్నది.

హిరణ్యకశిపుడు—ఎందుకు భయముఁ

లీలావతి—క్రాంతి సంకల్పమును విడుతునని బాస యిండు.

హిరణ్యకశిపుడు—లీలా! ఏమదిఁ లోకకళ్యాణదీక్ష తగని పనియాఁ

లీలావతి—లోక హితము మాట యటుండనిండు. మీ లీలకు హాని లేకుండ వర్తింపుడు.

హిరణ్యకశిపుడు—నేను నీ యొద్దనుండ నీకు హాని వచ్చునాఁ

లీలావతి—అయ్యో!

హిరణ్యకశిపుడు—లీలా! నిర్భయముగ నీ కృత్యము లెవరో....

లీలావతి—నాకు కృత్యములా!

హిరణ్యకశిపుడు—అయిన:

లీలావతి—మీ రీ విప్లవ ప్రయత్నమును వర్జింప మాట ఇండు.

హిరణ్యకశిపుడు—ఎట్టి కోరిక: అర్థములేని ఈ విలాపమేల: కాంతి లక్ష్యమును గనలేని నీకు దానిపేరు విన్నంత, యింత భయమేల:

లీలావతి—అయ్యో:

హిరణ్యకశిపుడు—(ఒకింత విసువుజెంది) ఆ:

లీలావతి—నా కోర్కెను చెల్లింపరా: నా మనవి నాలింపరా (హిరణ్యకశిపుడు మౌనము వహించును. లీలావతికి అశ్రువులు రాలును. గద్గదిక ముగ) నా యీ ముద్దును తీర్చరా:

హిరణ్యకశిపుడు—విప్లవమును నే త్యజించినచో ఇక నా జీవిత ప్రయోజన మేమున్నది:

లీలావతి—హరి: హరీ: నేనెంత హతభాగ్యను: మీ కెందుకీ వైదిక మత విధ్వంసము: ఆరు సంవత్సరముల తప:ఫలితము మిమ్ము వైదిక మత విధ్వంసకనిగా నొనరించినదా: మీ సంకల్ప మెట్టి కీడును తెచ్చునో చింతింపరా:

హిరణ్యకశిపుడు—(కించిత్ కోపమున) లీలా, ఏల నీవు వృథా భీతికి లోనయ్యెదవు: విప్లవ పరిణామము లోకసముద్ధరణము. ఇందు కీడు మూడుట కెట్టి హేతువును లేదు.

లీలావతి—అయ్యో: నా నోట నుచ్చరింపరాని కీడు దీనికి ఫలితముగదా: వైదిక మతమన్న ప్రేమలేనిచో మీరు దానిని పరిత్యజింపరాదా: యావల్లోక భారమును మీరేల పూనవలయును.

హిరణ్యకశిపుడు—[ప్రియముగ] నిన్నేదియో తీరని సందియము బాధించుచున్నది. మత వినాశముచే గలు నష్టమేమి: భ్రాంతినుండి, వంచనము

నుండి లోకమును తప్పించునట్టి నా పవిత్ర సంకల్ప నివృత్తియా నీవు నన్నడుగు వరము?

లీలావతి—అగును! విప్లవమును వీడుడు.

హిరణ్యకశిపుడు—ఏనిట్టి వెర్రిదాన వయిపోతివి. నా దీర్ఘ వియోగము నిన్నీ స్థితి తెచ్చెనా?.... ...నా విప్లవమందలి మహిమ నీవెరుగుదువా? దాని యాశయములు నీకు తెలుపనా!

లీలావతి—(హతాశయై) కానిండు.

హిరణ్యకశిపుడు—లీలా! వినుమా. నేను ప్రారంభించినది మహావిప్లవము. విప్లవమన్న అన్యాయదహనము, అప్రియభంగము, ధర్మ సంస్థాపనము. బలవంతులు బలహీనులబట్టి బాధించునపుడు బలహీనులు ఒకానొకనాడు తప్పక తిరుగబడుదురు. సార్వభౌములు, నిరంకుశులయి ప్రజారక్తమును దాహముగా గొనుచున్నపుడు, ప్రజలొక్కనాడు తప్పక తిరుగబడుదురు. అప్పుడు విప్లవము లేనిచో సృష్టి వికాసమేలేదు ఇప్పుడు మనదేశమున దేవుడు, మతము, ఆచార్యులు అందరు క్రొవ్వి ప్రజాపీడన మొనరించుచున్నారు. వీరికి సమత్వ బుద్ధిలేదు. ధర్మానుచరణ నశించినది. స్వార్థము, దురహంకారము వీరికి సహజాలంకారములైనవి. లీలా, ఇట్టి అత్యాచారుల రూపుమాపుటే నా సంకల్పము. దీనికి భిన్నముగా నేనెట్టి దుష్కృత్యముల నాచరింప గోరుటలేదు. కాన, లీలా—నీవిక భయపడ పనిలేదు.

లీలావతి—దీనికి కర్తగ మీరేల యుండవలయును? అన్యాయము పెరిగినపుడు కాంతి తనంతట తానే రాదా?

హిరణ్యకశిపుడు—అగును. కాని ప్రజలకు తండ్రియగు నేను ప్రజాహితమని తలంచిన కార్యమును చేయుట నాకు పరమవిధి.

లీలావతి—అయ్యో! మీకేల యీ కక్ష! ఋషులెల్ల మీకు ప్రతిపక్షులా కారా?

హిరణ్యకశిపుడు—అగును! విప్లవము వారి లాభముల నశింపచేయునదై నపుడు వారి కెట్లది రుచింపగలదు?

లీలావతి—ఋషులెల్ల ఐక్యకంఠముగా ఈ విప్లవమును శపించుచున్నారు.

హిరణ్యకశిపుడు—విప్లవమును శపించిన కల్గి నష్టమేమి? మంత్రము లకు మామిడికాయలు రాలునా. శాపములు విప్లవము నడ్డునా నవ్వును)

లీలావతి—అయ్యో! కాదు, కాదు. దైవద్రోహమున కొడబడిన మిమ్ముల దైవము ఈ దినమే హతమార్చునట ఇది విన్నప్పటి నుండి.....

హిరణ్యకశిపుడు—(నవ్వి) వెర్రి లీలా! ఎందుకీ సంశయము. అనప రాధుల శాపమాత్రమున ధ్వంస మొనరింపగల శక్తి గలిగిన, బూటక ముల ఋంగయగు మతమును బట్టుకొని ప్రాకులాడనేల? లీలా నీవిక భీతిల్లకుము. నిర్విచారముగ నుండుము.

లీలావతి—ఏమి? మీ సంకల్పమునుండి విరమించు కొంటిరా?

హిరణ్యకశిపుడు—లేదు! లేదు. దేవుడు దయ్యము కల్పితమాత్రలు.

లీలావతి నా మొరాలకించరా! అబ్బా! నా హృదయవేదన తీర్చరా!

హిరణ్యకశిపుడు—పిచ్చిలీలా! ఎంత బేలవు. లేని ఆపద కల్పించుకొని తత్తరబడెద వెందుకు?

లీలావతి—నిర్హేతుకముగ భయపడను. ఋషివాక్యములేగాక, నన్నేదో సందియముకూడ బాధించు చున్నది.

హిరణ్యకశిపుడు—లీలా! కల్పితభయములా పెక్కు వెతల గొలిపును. ఋషులా వీవు నాప్రాణప్రియవగుట, నిన్ను భయపెట్టి నీచేత వారి కరిష్ట దాయకమగు నా దివ్య సంకల్పమును భగ్నమొనర్ప యుక్తి పన్నినారు.

ఇంతకు విశేషమేమియు లేదు. శంకలుపీడి నిర్విచారముగ నుండుము.
దేవుడే కల్లయినపుడు నన్ను సంహరించుటెట్లు?
లీలావతి—అతడు సంహరించు మాటయేల? మీరీపట్టును వీడుడు. మీ పాదములకు....
హిరణ్యకశిపుడు—లీలావతీ! వూరక పిచ్చిదానివలె వాపోవకుము. నీవు భావించు దేవుడే కలడని యనుకొనుము. అతని నే నెదిర్చిన నన్ను సంహరింప నెట్లువచ్చును? ఇది యొక పిచ్చిభ్రమ. లీలా! దేవుడన్న అనంత కల్యాణగుణ పరిపూర్ణుడుగదా? అట్టిహాడు నావంటి మానవు డపచారము జేసినను మూర్ఖ మానవునివలె కుపితుడగునా? లీలా కోపి దేవుడెట్లు? లీలా! తెలిసియు తెలియని ధర్మ మీమాంసకు మనసున దారితీయకుము. దేవుడు కటికకల్ల.
లీలావతి—అయ్యో! నా ప్రారబ్ధము. నా మనవి నాలింపరుగదా! ఋషి వాక్యములు రిత్తబోవునా?
హిరణ్యకశిపుడు - ఋషులకు నా మీద కోపముండిన నుండుగాక! వారెంత కుపితులయిన నన్ను సంహరించగలరా?
లీలావతి—ఉత్తములగు ఋషుల హత్య కొడబడుదురా? వారుకాదు....
హిరణ్యకశిపుడు—ఋషులే హత్యవంటి క్షుద్రకర్మకు గడంగనిచో, వారికంటె సహస్ర గుణాధిక పావనుండైన దేవుడు క్రోధమున హత్యకు ఋను జేటి సమంజసము? లీలా! నీ వెంతమాత్రమును భీతిలవలదు. దేవుడు లేడు దైవ మతములు మానవ కల్పితములు. వీటి మూలమున లోకమున విహారము చేయుచున్నవి అశాంతి, అధర్మము, వానిసతనము. అస్మదీయమగు క్రాంతి లోక కళ్యాణ కారకము. లీలా, ఇట్టి మహా సంకల్పమునుండి ప్రాణభయమున చలింపమందువా? లీలా! మానవజీవిత ముత్తమాశయాన్వితము. ఆశయము లేని జీవిత మడవి గాచిన వెన్నెల. లక్ష్యము లేని జీవితము చుక్కాని లేని నావ! అట్టిచో మహా సంకల్ప

మును సాధించి లోకోద్ధారకుడుగా నున్న నీభర్తను ఉన్నత పథమునుండి భ్రష్టు నొనర్చుటయె నీకు సమ్మతమయిన కార్యమా? లీలా, ఉన్నత కార్యము లాచరింపగల్గియు, ప్రాణభీతిచే వానిపొంతకు బోని పురుషుడు పుట్టియు గిట్టినవాడేకదా! ఇట్టి మందుని జీవితము నీభర్తకు శోభించునా? ఇట్టి మందుడు నీకు నాధుడుగ నుండుట నీకు కీర్తికరమా? లీలా! నన్నడ్డకుము. ద్రోహులు, నీచులు, నన్ను సంహరింతురా? ఇది జరుగదు. జరిగిన జరుగనిమ్ము. నేను ధీరుడనయి కర్తవ్యపథమునుండి చలింపను. ఇది దృఢము.

లీలావతి—అయ్యో! నాకిక దిక్కెవరు?.....మీరే నా దుఃఖమును తొలగింపకున్న కాచువారెవ్వరు? నా మాట వినరా?

హిరణ్యకశిపుడు—లీలా! నన్నేల వ్యర్థముగ నొప్పించెదవు? నాకు హితమును గూర్చని నిరుపయోగమగు పనికేల బూనితివి? దుష్టబుద్ధుల కుతంత్రములో బడిపోయితివా?

లీలావతి—మీ హితమునకు స్వేచ్ఛకు భిన్నముగ ఒకరి కుతంత్రముల చిక్కెదానినా? నా మాట వినుడు.

హిరణ్యకశిపుడు—సూర్యుడు పశ్చిమమున ఉదయించినను, నా సంకల్పమును విడువజాలను. ఇది లేనిచో నా ప్రాణమే లేదు. (చరచర వెడలిపోవును.)

లీలావతి—అయ్యో! నాధా! నా పాపము బ్రద్దలయ్యెనా? నా కర్మము కాలిపొయ్యెనా!

ఆహా! దైవమా, అనాధను గాకుండ రక్షించు భారమునీది తండ్రీ.

[ఉన్మత్తవలె అటునిటు దిరుగుచు] రాగమంజరీ! రాగమంజరీ! కలకము! కలకము!

తెర

••••••••

ఎనిమిదవరంగము

(మధ్యాహ్నము మూడు గంటలవేళ. ప్రహ్లాదుని మందిరము. పరాశున నాలోచించుచు. సన్యాసి వేషమును ధరించుచు ప్రహ్లాదు డుండును. ప్రవేశము శుక్రాచార్యులు.)

శుక్రాచార్యులు—ప్రహ్లాదా!

ప్రహ్లాదుడు—(చకితుడై) ఆచార్యా! నమస్కారములు.

శుక్రాచార్యులు—ఏమి టాలోచించు చున్నావు?

ప్రహ్లాదుడు—ఏమున్నది ఆలోచనకు?

శుక్రాచార్యులు—ఈ యుడుపు లేమి?

ప్రహ్లాదుడు—గురువర్యా! కారణము చెప్పలేకున్నాను.

శుక్రాచార్యులు—ప్రహ్లాదా! చిత్రముగ మాట్లాడుచున్నావు. నీకు గురువును నేనుండ నీకు విచారమేల? విన్ను కలతపెట్టెడి విచారములేవో చెప్పుము. సందేహములెల్ల నే తీర్చెదను.

ప్రహ్లాదుడు—ఆచార్యా!

శుక్రాచార్యులు—సందేహములా వద్దు. సత్యము వివరింపుము.

ప్రహ్లాదుడు—నేను సన్యాసమును స్వీకరింప నిశ్చయించితిని.

శుక్రాచార్యులు—ఎందుకు?

ప్రహ్లాదుడు—ఈ రాజ్యమునం దుండుట నాకు దుస్సహము. దీని నెంత వేగముగ విడచిన నంత హాయి.

శుక్రాచార్యులు—ఇదేమి ప్రహ్లాదా?

ప్రహ్లాదుడు—అవును! నాస్తికుడగు, నా తండ్రిని ఎందును నిరోధించ లేను. ఆయన కష్టతగుల శక్తి నాకులేదు. ఇక రెండవది, దైవునకు, మతమునకు ఆదరము లేనిచోట నే నసలే యుండజాలను.

శుక్రాచార్యులు—(నవ్వి) ప్రహ్లాదా ! నీవేమి యాచరించుచున్నావో అందలి యుచితా నుచితముల నీ వెరుగవు.

ప్రహ్లాదుడు—క్షమింపుడు. ఎరుగుదును. బాగుగ నాలోచించియే.... ఇందుల కుద్యమించితిని.

శుక్రాచార్యులు—ఒక్కమాట, ప్రహ్లాదా! దేవుడు, మతములేని తావుం డునా?

ప్రహ్లాదుడు—నేడుగాకున్న రేపో, మాపో మనరాజ్య మట్టి తావుకాదా?

శుక్రాచార్యులు—ఎక్కటికిని జరుగదు.

ప్రహ్లాదుడు—ఎందులకు జరుగదు, అంతయు సిద్ధ మయినపుడు?

శుక్రాచార్యులు—ఎట్లు జరుగగలదు?

ప్రహ్లాదుడు—రాజసంకల్పము వృధయగునా?

శుక్రాచార్యులు—[నవ్వి] వెర్రి బాలుడా! అల్పమానవుడొకడు సృష్ట్యాది నుండి ప్రతిమానవుని రక్త కణకణమందు జీర్ణమయియున్న బలవత్తర మయిన మతము నెట్లు విధ్వంసము చేయగలడు.

ప్రహ్లాదుడు—రాజ శాసనమున!

శుక్రాచార్యులు—రాజు, శాసనము వట్టిమాటలు. అవి చెల్లుదినములు పోయినవి, ప్రహ్లాదా! ఏనాడు రాజు దైవప్రతినిధిత్వముపీడి దైవ విధ్వం సమున కీయకొనెనో, ఆనాడే వాని శాసనములు అబలల యార్తనాదము నకు తుల్యమయి పోయినవి.

ప్రహ్లాదుడు—అయిన నా తండ్రి విప్లవ సంకల్ప మిపు డీడేరదా?

శుక్రాచార్యులు—ఇప్పుడు నెరవేరదు.

ప్రహ్లాదుడు—ఏ నాటికయిన యీడేరును గదా!

శుక్రాచార్యులు—వెర్రిబాలకా, హిరణ్యు డాడినదెల్ల యాటయై చెల్లు నను కొంటివా? అది వట్టి భ్రాంతి మాత్రమే. వాని నెత్తిపైనున్న మహాశక్తి

మరచితివా? నీతండ్రికంటె బలాఢ్యుడు దేవుడను సంగతి యూహింప లేతివి.

ప్రహ్లాదుడు---అవును, జగదీశ్వరుని గరిమ నెన్న నెవరితరము?

శుక్రాచార్యులు---ఇక నీకీ విరక్తియేల? ఈ వేషమేల? ఇట్లు పారిపోవనేల?

ప్రహ్లాదుడు---నే విటనుండి చేయగలుగున దేమున్నది? దైవమే భువి నవతరించి తన స్థితిని, మతమును నిలబెట్టు కొనువరకు, నేనీ రాజ్యమున నుందను.

శుక్రాచార్యులు---ఎంత పిచ్చివాడ వయిపోతివి?

ప్రహ్లాదుడు---ఆచార్యా! మీ భావము నా కర్థము కాలేదు.

శుక్రాచార్యులు---ఒక్కమాట శ్రద్ధగవినుము. పురుషప్రయత్నము లేనిది దైవసంకల్పము విశ్వమున సిద్ధించునా? భక్తుడగు నీకిది తెలియదా?

ప్రహ్లాదుడు---మానవ ప్రయత్నము కావలెనా! అయిననేమి? నే నేల యిట నుండవలయును? నావంటి అల్పజీవివలన మత సంరక్షణవంటి మహా కార్యమునకు సాయము కలుగునా?

శుక్రాచార్యులు---పరమ భాగవత శిరోమణివగు నీవంటి వానివలన ఇట్టి పవిత్రసంకల్ప మీడేరకున్న ఇంకొకరివలన సిద్ధించునా? నీవీ పరమ పావన కార్యభారమును వహించి లోకమును ధన్యముచేయుము. భక్తుడి వగు నీకు మత సంరక్షణకు మించిన జపము లేవియును లేవు.

ప్రహ్లాదుడు---అబ్బా! ఎంతమాట! ఇట్టి మహా కార్యమునకు బాలుడ నగు నేనా!

శుక్రాచార్యులు---అవును. భక్తులు తమ శక్తిని తా మెరుగరు. నీవంటి మహాభక్తుడు స్వశక్తిని తెలియకుండుట న్యాయమే.

ప్రహ్లాదుడు---ఆచార్యా! నా జనకుని నిజ సంకల్పమున్నది మరల్పగల నని యూ మీ విశ్వాసము.

శుక్రాచార్యులు—నీవుకాదు. నీ తండ్రివంటి వారెందరయిన ఆపనిని చేయజాలరు. (ఆలోచన నటించి) భగవత్స్వరూప ప్రాప్తికి సాధనమయిన మతమును, అందును లోక లోకాంతర ఖ్యాతిగన్న వైదిక మతమును, తుదకు ఆస్తిక్యభావమును నిర్మూలింపబూనిన నీతండ్రిని మార్చ నీతరమా!

ప్రహ్లాదుడు—అయిన నేనేమి చేయగలను?

శుక్రాచార్యులు—నీతండ్రిని తనపథమునుండి తప్పించమనికాదు నిన్ను కోరునది.

ప్రహ్లాదుడు—అయిన మీ యుద్దేశ్య మేమి?

శుక్రాచార్యులు—జనకుని యనంతరము నీవు సింహాసన మధిష్ఠించి రాజ్యమునందంతట భగవద్విశ్వాసమును, భక్తిని నెలకొల్పి వైదిక మతోద్ధరణకు బూని, ధన్యుడవు కావలయును.

ప్రహ్లాదుడు—జనకుని అనంతర కర్తవ్యమునుగూర్చి ఇప్పటినుండి ఏలదిగులు. నేనెప్పుడును తమ విధేయుడనేగదా?

శుక్రాచార్యులు—నీతండ్రి త్వరగా నీకు సింహాసనము వదలు స్థితి రాగలదు.

ప్రహ్లాదుడు—అదెట్లు?

శుక్రాచార్యులు—నాస్తికుడు, మత విరోధియగు నీతండ్రి యీనాటి సాయంత్రమునకు శ్రీహరిచే నిహతుడగును, (ప్రహ్లాదుడు వెర్రిచూపులతో ఆచార్యుని వంక జూచును.) ఇది మహా ఋషుల వాక్యము. మహాభక్తుడవు, నా ప్రియ శిష్యుడవగుటచే నీకీ రహస్యమును ముందుగ తెలిపితిని. అనర్హులగు వారికీ రహస్యమును ముందుగ తెలిపిన వానిశిరము శతధాభిన్నమగున నిమహా ఋషుల శాపము.

ప్రహ్లాదా! అంతయు తెలిసినదా! ఇక జరుగనున్నది జరుగక మానదు. నీవు పందపలె దేశమును వీడి పలాయనము చేయకుము.

వైదిక మతోద్ధరణ భారమును నీవు వహించుట దైవ సంకల్పముగా నెరుంగుము.

ప్రహ్లాదుడు—(భీతుడయి) మహర్షి వాక్యములుగ నాతల్లి చెప్పినదంత యును సత్యమేనా?

శుక్రాచార్యులు—అవును.

ప్రహ్లాదుడు—అయ్యో!

శుక్రాచార్యులు—ప్రహ్లాదా! ఏల నీకీ తగని విచారము? మత విధ్వంసకుడు దైవవిరోధి చావన్నన్న మతోద్ధారకుడు, దైవ భక్తుడు వాపోవ దగునా?

ప్రహ్లాదుడు—హిరణ్యకశిపుడు నా తండ్రి!

శుక్రాచార్యులు—హిరణ్యకశిపుడు వైదికమత విధ్వంసకుడు!

ప్రహ్లాదుడు—అబ్బా! నా తండ్రికి మృత్యువు తప్పదా! సంకల్పమును విడచిన ప్రాణభీతి యుండదని నారదమహర్షి జెప్పెనే!

శుక్రాచార్యులు—సంకల్పమును విడచిన జీవితాశ కలదు. నీవు భిక్షు డవు. నీ యభీష్టమెట్టు పరిణమించునో ప్రయత్నించి చూడుము. పోయి వచ్చెదను.

ప్రహ్లాదుడు—ఆచార్యా! నన్నాశీర్వదించి....

శుక్రాచార్యులు—[చరచర బోవుచు] సత్వర సామ్రాజ్యసిద్ధిరస్తు!

[నిష్క్రమించును.]

ప్రహ్లాదుడు—నా తండ్రి జీవింపవలయునని యాశీర్వదింప నేదేమి తెర మాటున నేమున్నదో?

తెర

.....

తొమ్మిదవరంగము

[సాయంకాలము. శి గంటలవేళ : సేనాని మందిరము : శుక్రా చార్యులు, మంత్రి, సేనాని, ప్రవేశింతురు.]

శుక్రాచార్యులు—ఇక ఎవరిపనులు వారు చూచుకొనవచ్చును.

మంత్రి—ప్రహ్లాదునితో మాట్లాడితిరా?

శుక్రాచార్యులు—ఇప్పటివర కతని యొద్దనే యుంటిని.

మంత్రి—అతని యుద్దేశ్య మెటులున్నది?

శుక్రాచార్యులు—జనకుని సంహార మనిసంతనే త్రిళ్లిపడినాడు. కాని తన తండ్రి యసువులుబాసినంత, గద్దియనెక్కి దైవ మతోద్ధరణ దీక్షకు పూనుకొన గలడు.

మంత్రి—అతని కిష్టములేకున్న మనకార్యము కొనసాగించుటెట్లు.

సేనాని—నర్వ మతనికి గుప్తముగ నుంచియే!

శుక్రాచార్యులు—[చిరునగవుతో] భగవంతుడే తనంతతా వచ్చి తండ్రిని చంపునని యంటిని.

సేనాని—దైవమే స్వయముగ వచ్చి చంపునంటిరా?

మంత్రి—అతడది నమ్మెనా?

శుక్రాచార్యులు—న మ్మక చేయునదేమి? ఋషి వాక్యములు విశ్వశింపని వ్యక్తి రౌరవనరకజ్వాలల కాహుతి యగునని యెరిగిన అతడేల నమ్మ కుండును.

సేనాని—అగును; బాలుడు పరమసాధువు.

శుక్రాచార్యులు—అతనికొక సందేహము మాత్రము కలిగెను.

మంత్రి—ఏమది?

శుక్రాచార్యులు—తన తండ్రి సంధ్యలోపల తన సంకల్పమును మార్చు కొన్న జీవించునా యని?

సేనాని—మీరేమంటిరి.

శుక్రాచార్యులు—పరమభక్తుడవు; నీప్రయత్న మెటులనుందునో చూడ మంటిని.

సేనాని—ప్రహ్లాదుని కొరిక కనుగుణ్యముగ రాజు తన సంకల్పమును విరమించుకొన్న అతనిని సంహరింపనేల?

శుక్రాచార్యులు—చాల అసంభవము, హిరణ్యకశిపుడు తన సంకల్పము నుండి విరమింపడు.

సేనాని – ప్రియపుత్రుని విలాపమునకు మెత్తబడునేమో?

మంత్రి—మృత్యువునకు భయ....

సేనాని—హిరణ్యకశిపుని నేనెరుంగుదును. ఆయన నాస్తికుడయిన నగు గాక. కాని మృతియన్న భయ మెప్పుడును లేదు.

శుక్రాచార్యులు—వెర్రి ఆలోచనలు మనకెందుకు? హిరణ్యుడు తన సంక ల్పమునుండి విరమించుకొన్నను మన పని సాగితీరవలసినదే.

సేనాని—ఎందుకు?

శుక్రాచార్యులు—వాని నీదినము బ్రతుకనిచ్చిన, సర్వమును వాడు గ్రహించిన మన ప్రాణములు మనవి కావు. వాడెట్టి యోధుడో, అట్టి సూక్ష్మగ్రాహియును. మన గుట్టు తెలియక మానదు– ఇంకను– ఈనాటి పుత్రునిమొర వినో, లేక మరే విధముననో సంకల్పము విడచినను, అది తాత్కాలికమే.

మంత్రి, సేనాని—నిజము! నిజము.

శుక్రాచార్యులు --తప్పక ఈనాడు వానిని తుదముట్టింపవలయును.

మంత్రి, సేనాని__తప్పక.

మంత్రి__ఒక్కమనవి.

శుక్రాచార్యులు__ఏమి.

మంత్రి—తండ్రి క్రాంతి సంకల్పమునుండి విరమించినను, దేవు డేల నిర్దయుడై సంహరించెనని ప్రశ్నించిన ప్రహ్లాదుని కేమి సమాధానమివ్వ వలెను.

శుక్రాచార్యులు—పాప మప్పటికే పండినదనియు, భగవల్లీల లవాగ్మానస గోచరములనియు.

మంత్రి -- సరి.

శుక్రాచార్యులు—విక్రమసేనా, ఇక నీ కార్యమును నిర్వర్తింపుము. [నిష్క్రమించును.]

మంత్రి—జాగ్రత్తగ మెలగవలయునుసుమా. లేకున్న ప్రాణముల మీదకి తీసుక రాగలవు.

సేనాని__ఇక మీకు సందేహమెందుకు. పాపమున కొడబడుటయే తడవు, పిదప నంతయు సులభమే.

10]

పదవరంగము

[సాయంసమయము. ఆరుగంటలు దాటును. హిరణ్యకశిపుని మంది రము. రంగము మధ్య నొక స్తంభము : హిరణ్యకశిపు డాలోచించుచు కూర్చొని యుండును. దూరమున మంగళగానము. నెమ్మదిగా నది సమీపించును.]

గానము

రాక్షసేంద్రుడ, రహిని ధాత్రివి। గావబుట్టిన కరుణ సాంద్రుడ
జయము రక్షక, క్ష్మాతలేశ్వర। జయమునీకిల జయము జయమగు.

హిరణ్యకశిపుడు—ఏమిచిత్రము। (లేచి అటునిటు తిరుగును)

[ప్రవేశము : నారదుడు.]

హిరణ్యకశిపుడు—నారదా। ఏమిది। నన్ను చాలగ స్తుతించుచున్నావు. చాల విచిత్రముగ నున్నది.

నారదుడు—ఇందు చిత్రమేమున్నది।

హిరణ్యకశిపుడు—చిత్రమేమియును లేదా।

నారదుడు—చిత్రమేమున్నది। నీవు తపస్సునుండి రాజ్యమునకు వచ్చుటే తడవు, ప్రజలు దైవమును మరచి నిన్నె దైవముగ గొలుచు చున్నారు. నీవన్న జగత్కళ్యాణము నపేక్షించిన, ప్రజల సార్వభౌముడవు. ఇక నీఘనత వినుతించుటలో నాశ్చర్యమేమి।

హిరణ్యకశిపుడు—ఏమిలాభము। ప్రజల మౌఢ్యము ఎప్పటివలెనే యున్నది.

నారదుడు—ఏ మట్లనుచున్నావు।

హిరణ్యకశిపుడు—ఏమున్నది। ఇప్పటివరకు ప్రజలు లేనిదైవమును గొలుచుచున్నారు. ఇప్పుడు కంటి కగుపడు నన్ను గొలుచు చున్నారు.

నారదుడు—లేని దైవమా? దైవములేదా?

హిరణ్యకశిపుడు—దైవ మెక్కడున్నాడు నారదా? దైవము తొలిత తానుపుట్టి జనుల సృజించెనా, లేక జనులు ముందుపుట్టి వానిని సృజించిరా? దేవుడు మానవ కల్పితుడు. నిశ్చయముగ స్వార్థపరుల సృష్టియే దైవము.

నారదుడు—హిరణ్యకశిపా! మేలొక్కించి మాట్లాడు మాటలేనా ఇవి?

హిరణ్యకశిపుడు—ఎట్టి వింతవాడవు నారదా! నేను మేలొక్కినియున్నది లేనిది నీ కగుపడుటలేదా? ఆరు సంవత్సరముల తపస్సుచే భ్రమపరిమలను గ్రహింప జాలనంతటి మందమతి ననుకొంటివా నన్ను?

నారదుడు—హిరణ్యకశిపా! నీవు నమ్మినదానికి ప్రాణములు తృణప్రాయముగ నర్పింపగల ధీరుడవు. కాని, నేను నీ కాప్తుడను. నిన్ను సంరక్షింప కోరిక పొడముచున్నది. జరుగనున్న దంతయును విప్పి జెప్పెదను—కాలుడు నీనెత్తిపై నృత్యము చేయుచున్నాడు. నీ మృత్యువు ఘడియల లెక్కించుచున్నది.

హిరణ్యకశిపుడు—నారదా! ఎందుకు నామీద జాలిని జూపనెంచెదవు. ఏమయినను నాపట్టును వీడను.

నారదుడు—హిరణ్యకశిపా, నావిధిని నేను నెరవేర్చితిని. నీ శీలము ప్రశంసనీయమే. నీ యుదారసంకల్పము స్తవనీయము. కాని నీ వీనాడు మృత్యుముఖమున బడక తప్పదు.

హిరణ్యకశిపుడు—నారదా! సంకల్పమునకు బలియగుటకంటె పురుష లక్షణ మేమున్నది?

నారదుడు—నా విధిని నేను నెరవేర్చితిని. పోయెదను. [నిష్క్రమించును]

హిరణ్యకశిపుడు—[కూర్చుంది ఆలోచనలో మునిగిపోవును] ఋషుల మాటలే నారదుడు పలుకుచున్నాడు. ఇవి వ్యర్థప్రలాపములా?

ధ్వని

హిరణ్యా! ద్రోహము నిన్ను వెంటాడుచున్నది జాగ్రత! [మందగానము]

హిరణ్యకశిపుడు—అగు గాక! నా విధి నెరవేర్చెదను. [ఆలోచింప గడ గుచు] [సగము రాజదుకూలములతో, సగము సన్యాసివేషముతో, కేశ సంస్కారములేక తత్తరపాటు—భయము, దుఃఖము ముఖమున చిందులు తొక్కుచుండ, ముచ్చెమటలతో ప్రహ్లాదుడు పరివేశము.]

ప్రహ్లాదుడు—తండ్రీ! తండ్రీ!

హిరణ్యకశిపుడు—నాయనా, ఇటురమ్ము! ఏమి యింత తత్తరపాటు?

ప్రహ్లాదుడు—తండ్రీ! తండ్రీ!

హిరణ్యకశిపుడు—[ప్రహ్లాదుని వికృత వేషమును చూచును] నాయనా, ఏమీ వికృత వేషము? ఈ సన్యాసి యుడుపులేల? తల ఇటు విరియ బోసికొంటివేమి? యీ పెద్ద నిట్టూర్పు లేమి?

ప్రహ్లాదుడు - అంతయును చెప్పెదను! ఒక్కమాట వినవా?

హిరణ్యకశిపుడు—ఒక్కమాటకాదు. వేయిమాటలు వింటును. వీకేమి కావలయునో చెప్పుము. ఇటురమ్ము, కూర్చునుము. [చేరదీయబోవును]

ప్రహ్లాదుడు—ముందు నా మాట వినుడు.

హిరణ్యకశిపుడు—ఏమంత తొందర? చెంతకు వచ్చి కూర్చునుము.

ప్రహ్లాదుడు—కూర్చుందును కాని, నామాట వినుము....అబ్బా! నాగుండె లదరుచున్నవి, తల తిరుగుచున్నది. ఎట్టి ఘోరవార్త! ఈ రోజున నీ సంహారమట?

హిరణ్యకశిపుడు—[వికట హాసము చేయును] ఋషుల వలన వింటివా?

ప్రహ్లాదుడు—అవును, ఋషి వాక్యములే ఇవి. ఋషుల వాక్యము లెంత భయంకరములు.

హిరణ్యకశిపుడు—ప్రహ్లాదా! అమాయకత్వమున సీతల్లినుండి యూడి పడితివి.

ప్రహ్లాదుడు—ప్రాణములమీదికి వచ్చిన స్థితియందును పరిహాసమా?

హిరణ్యకశిపుడు—కుమారా! నా మాటయందు పరిహాస మేమాత్రమును లేదు. సీతల్లివలె నీవు కేవల నిష్కాపట్య మూర్తివని యంటిని. నీమాత ఎంత సహజభీరువు?

ప్రహ్లాదుడు—నేను భీరువునా?

హిరణ్యకశిపుడు—కాకున్న చావు చావని కలవరించి భీతిల్లనేల?

ప్రహ్లాదుడు—మృత్యుభీతివే నేనేమి తత్తరపడుటలేదు. నీవు దూర మగుదువన్న దుఃఖముచేతనే గాని....

హిరణ్యకశిపుడు—వెర్రినాయనా! ఇదియా నీ భయము? నీతండ్రి ఏనాటి కయినా మృతినొందకుండునా?

ప్రహ్లాదుడు—అయ్యో! కాలచక్ర మెంతవేగిరముగ తిరిగి పోవుచున్నది? అప్పుడే సాయంతనమా?

హిరణ్యకశిపుడు—సాయంతనమయిననేమి? నూతన ప్రభాతమును జూడ గలవు. ప్రాణితపోయిన క్రొత్త వచ్చునుగదా!

ప్రహ్లాదుడు—కాదు! కాదు!

హిరణ్యకశిపుడు—మరేమి తండ్రీ!

ప్రహ్లాదుడు—ఈ సాయం సమయమునందే నీ మృత్యువు ముహూర్తమని ఋషుల వాక్యము.

హిరణ్యకశిపుడు—ఎట్టి వెర్రి!

ప్రహ్లాదుడు—మతవిరోధియగుట మిమ్ము దైవమిపుడు హతమార్చునట.

హిరణ్యకశిపుడు—న న్నెవరు చంపగలరు నాయనా?

ప్రహ్లాదుడు—భగవంతుడు సర్వ శక్తిసంపన్నుడు గదా!

[సరిగా ఈ సమయమునకు హంతకుడు సింహవక్త్రముతో బాకుతో స్తంభము మాటునకు మెల్ల మెల్లగ వచ్చి దాగికొనును. ఆది వీరిద్దరు వరికింపరు.]

హిరణ్యకశిపుడు—ప్రహ్లాదా దైవమేల?

ప్రహ్లాదుడు—తండ్రీ దైవము సత్యము.

హిరణ్యకశిపుడు—అయిన వాని యునికి యెచట?

ప్రహ్లాదుడు—అతడు సర్వవ్యాపకుడని శాస్త్రప్రమాణము గదా?

హిరణ్యకశిపుడు—[నవ్వి] శాస్త్రములు ఆచార్యులకు, గురువులకు స్వప్ర యోజనముల గూర్చు పిట్టకథలు. దేవుని యడ్డముగా జేసికొని వీరులు క్షుద్రకార్యముల పెక్కుచేయుదురు. ప్రహ్లాదా! నీ గురువులు భావించు దైవము కల్పన మాత్రమే.

ప్రహ్లాదుడు—అయ్యో! ఎట్టి మాటలివి తండ్రీ! దైవమే లేకున్న దైవ మెట్లు మిమ్ముల సంహరించును.

హిరణ్యకశిపుడు—ప్రహ్లాదా! దైవము నన్ను చంపుట కటిక కల్ల.

ప్రహ్లాదుడు—అయిన ఋషు లట్లేల వచింతురు?

హిరణ్యకశిపుడు—నీవు చిన్నవాడవగుట నిన్ను గురువులు మోసగించిరి. కృతఘ్నుడగు మానవుడు ఏమరుపాటున నన్ను చంపిన చంపునేమో గాని, క్షుద్రుడగు మానవుడు ఏదిటవుతో నన్ను చంప సాహసించును?

ప్రహ్లాదుడు—తండ్రీ! నా మాట వినవా!

హిరణ్యకశిపుడు—ఏమి నాయనా!

ప్రహ్లాదుడు—దైవము లేదనకుడు. నమ్ముడు దైవము కలడు, కలడు!

హిరణ్యకశిపుడు—నాయనా! చెంతకురమ్ము! నీకు సత్యమును బోధించెదను. నా యుద్యమమున కండగా నిలచి లోక కళ్యాణమునకు గదంగుము. దైవ మతములు మానవుని వ్యర్థ భావములు. ధర్మము, ప్రేమ, దయ, ఇవి కలిగిన, విశ్వశాంతికి చాలును.

ప్రహ్లాదుడు—అబ్బా! ఎంత మాట! దైవము లేడా! ఉన్నాడు! ఉన్నాడు!

హిరణ్యకశిపుడు—ప్రహ్లాదా! నీవు పూర్తిగ గురువులచే వంచింపబడితివి.

ప్రహ్లాదుడు—నా మాట వినవా!

హిరణ్యకశిపుడు—ప్రహ్లాదా! సత్యమును మంట గలుపమందువా!

ప్రహ్లాదుడు—(కన్నీరు గార్చుచు, తండ్రి మోకాళ్ళకు పెనవైచుకొని మోమెత్తి తండ్రివంక జూచుచూ) నా మాట వినుడు. భగవంతునితో వైరము మానుడు.

హిరణ్యకశిపుడు—నీ వెరిగి మానుము. (చిరునవ్వుతో) దేవుడన్న నీకంత నమ్మకమా!

ప్రహ్లాదుడు—పూర్తిగా!

హిరణ్యకశిపుడు—అయిన దేవుడెట నున్నాడు!

ప్రహ్లాదుడు—ఎల్లెడల!

హిరణ్యకశిపుడు—(నవ్వుచు) ఈ స్తంభమున! (నిల్చొని ప్రహ్లాదుని మోమును తిలకించుచు స్తంభమును వేగిలితో జూపును)

ప్రహ్లాదుడు—తప్పక!

హిరణ్యకశిపుడు--అగుచో నాకిందు జూపింపగలవా: (నవ్వుచూ ప్రహ్లా దుని వంక జూచును. ఇంతలో హఠాత్తుగా హంతకుడు హిరణ్యకశిపు వెనుకనుండి లఘించి బాకుతో దొక్కులో పొడిచి పలాయితుడగును. తటాలున ప్రత్యక్ష మయిన నరసింహరూపము కంటబడినంత ప్రహ్లా దుడు కండ్లుమూసికొని ప్రార్థించును)

హిరణ్యకశిపుడు--(దుర్భరవేదనతో) అబ్బా! (మూల్గుచు క్రిందకొరు గును.)

ప్రహ్లాదుడు--(కనులు తెరచి మరణవేదన యందున్న తండ్రిని జూచి) అయ్యో! భగవంతుడు మిమ్ములను సంహరించెనా!

హిరణ్యకశిపుడు--ఇంకను దేవుడా! మూఢుడా! ఇదియంతయు గురు వుల ఘోరకృత్యము.

ప్రహ్లాదుడు--హరి హరీ! కడ నిముసమందేని గురుజన నిరసనముమాని దేవుని స్మరించి నరకకూపమునుండి తప్పించుకొనుడు.

హిరణ్యకశిపుడు--ప్రహ్లాదా! నా తుదిమాటల వినుము. నేను ప్రాణ ముల కోల్పోయినందుకు విచారింపను. కాని, నీవు కేవలము మూఢుడ వయిపోయితివి. వీరల నాశనకాలమిక సమీపించినది నా క్రాంతినాప వీరి తరముకాదు. నే చచ్చినను, విప్లవ మొక్కసారి అగ్నిపర్వతమువలె బ్రద్దలుకాక మానదు. దాని ప్రచండాగ్నిజ్వాలల నొకనాడు దైవ, మత, గురువులు బుగ్గియై పోవుదురు.

నాయనా! నా యవసానము సమీపించుచున్నది. స్మృతి తప్పు చున్నది. (హీనస్వరమున) కల్పిత దైవభావము వీడుము. మతమును కలనైన స్మరింపకుము. ఇవన్నియు అసత్యములు. నమ్ముము! నమ్ము.... (కండ్లు మూతలు పడును.)

(లీలావతి ఉన్మాదినివలె "నాధా, నాధా" అని అరచుచు ప్రవేశించును. రుధిరమున బడియున్న హిరణ్యుని శవమునుజూచి స్తంభితయై పోవును)

లీలావతి--అయ్యో! అప్పుడే సర్వనాశనమయిపోయినదా! [వెర్రి కేక వేసి మూర్ఛపోవును.]

ప్రహ్లాదుడు--హా! జగదీశ్వరా! నా తండ్రిని స్వర్గమున నయిన జేర్చవా తండ్రీ!

(నేపధ్యమున వికటాట్టహాసము. ప్రహ్లాదుడు తృళ్ళిపడి యటు వంక జూచును.)

11) పదునొకండవరంగము

[రాత్రి 8 గంటల వేళ. దేవళమున గర్భగుడి. శుక్రాచార్యులు, ఋషులు ప్రవేశింతురు]

శుక్రాచార్యులు—ఓం! ఓం! ఓం!

అందరు—ఓం! ఓం! ఓం!

శుక్రాచార్యులు—మహాశయులారా! జయము సిద్ధించినది.

ఒకఋషి—మనకు జయము కలుగకుండునా?

శుక్రాచార్యులు—ప్రహ్లాదుడు రేపు రాజ్యమును స్వీకరించును. వైదిక మతముయొక్క కష్టములు గట్టెక్కినవి.

రెండవఋషి—పరమ పావనములైన మతమునకు కష్టములు కలకాలముండునా?

శుక్రాచార్యులు—హిరణ్యకశిపకృతమగు, నవీన గ్రంథమును గొనివచ్చితిని. దానిని రూపుమాపవలెను. లేకున్న ప్రజ లందలి సత్యాసత్యములను గ్రహింపగలరు. మనకొంపకు మరల నప్పుడు నిప్పంటుకొనును.

మూడవఋషి—అట్టి ఉత్తమగ్రంథమును దగ్ధము జేయకపూర్వము, ఒక్కసారి మన మందలి చర్చలి చూడకూడదా!

ఒకటవఋషి—ఎన్నటికిని కూడదు. దానిని ముట్టినంత పాపము వచ్చును. దానిమాటల నుచ్చరించినంత కాశీలో గోహత్యజేసినంతపాపము.

అందరు—వెంటనే దానిని కాల్చివేయుడు.

శుక్రాచార్యులు—సరి. (హిరణ్యుని గ్రంథమును హోమగుండమున బడవేయును. అది భస్మమగువరకు ఎల్లరు ఆతురతతో చూచుచుందురు.)

ఒకఋషి—మతమునకు గండము తప్పినది.

శుక్రాచార్యులు—వైదికమతమునకు జయము! దిగ్విజయమగుగాక!

అందరు—మతమునకు దిగ్విజయము.

శుక్రాచార్యులు—కాంతి విర్మూలమగుగాక!

అందరు—తథాస్తు!

(నేపథ్యమున ప్రజల వికటాట్టహాసము. ఎల్లరు నివ్వెరగంది తెరవైపుజూతురు. ధ్వని హానము చేయుచునే యుండును.)

తెర

.....

పంఱ్ఱెండవరంగము

(రాత్రి పంఱ్ఱెండు గంటలవేళ. శుక్రాచార్యులు శయ్యాగారములో, మంద దీపజ్యోతి, పర్యంకముపై ఆచార్యులు పవ్వళించియుందురు. నిళ్శబ్దము. నేపథ్యమున హిరణ్యకశిపుని కంఠస్వరము.)

ఆచార్యా! ఆచార్యా!

(శుక్రాచార్యులు తుళ్ళిపడి నిద్రినుండిలేచి కళ్లు నులుముకొని యటునిటు చూచుచుండును. ఇంత మొనతేలిన గడ్డము, బట్టతల 20 వ శతాబ్దపు ఐరోపా యుడుపులతో నొక పొట్టివ్యక్తి ప్రవేశము)

శుక్రాచార్యులు—(భయమున) ఇదేమి వికృతాకారము.

వ్యక్తి—(నవ్వి) ఆచార్యా! నన్ను గుర్తింపజాలవా?

శుక్రాచార్యులు—ఎవరది. కంఠస్వరము మాత్రము పరిచితముగనే యున్నది. కాని వికృతాకారమును దాల్చుటచే పోల్చుకొన జాలకున్నాను!

వ్యక్తి—ఆచార్యా! హిరణ్యకశిపునే మరచితివా?

శుక్రాచార్యులు—హిరణ్యకశిపా! ఏమి ఘోరాకారమిది? నే జెప్పిన మాటలు వినక భగవద్విరోధమును కొని తెచ్చుకొనుటచే, దైవము నిన్ను నరకమున బడవైచి, ఈ వికృతాకృతి యొసంగెనా!

[వ్యక్తి నవ్వును. శుక్రాచార్యులు చకితుడగును] ఏల నవ్వుచున్నావు!

హిరణ్యకశిపుడు—ఆచార్యా! ఇది కలియుగము. నా విప్లవ మిప్పటికి జయించినది.

శుక్రాచార్యులు—అదెట్లు హిరణ్యకశిపా!

హిరణ్యకశిపుడు—ఆచార్యా! మీరింకను కండ్లు తెరువలేదు? అంతయు దెలిసి కపటనాటక మాడనేల? దైవమును, మతమును నమ్ముటకు మతి హీనులుండుటకు కృతయుగముకాదు. సత్యాసత్యముల గుర్తెరింగిన కలి యుగము. ఇది పరీక్షాక్షేమమునకు సర్వతోముఖమగు మానవాభ్యుదయ ములకు ద్వారితీయు నవయుగము. ఔనిసత్యమునకు స్వస్తిచెప్పిన యుగ మిది. అవివేకాంధకార మంతరించినది. సూర్యోదయము కానున్నది. కండ్లు తెరువుము. పోయి వచ్చెదను. [నిష్క్రమణ]

(ఆచార్యులు పర్యంకముపైబడి ఆటునిటు దొర్లును. నేపథ్యమున "విప్లవమునకు జయమగుగాక, దైవమతములు మంట గలియుగాక" నేపథ్యమున కలకలము విని ఆచార్యులు కండ్లు తెరచికొని కూర్చుండును.)

ఆచార్యులు—అబ్బా! ఏమికల!

*　　*　　*

అనంతప్రాంతము-గాఢాంధకారము-నిశ్శబ్దము-మందగానము-నిశ్శబ్దము.

(హిరణ్యకశిపుడు కొత్తవేషముతో ప్రవేశము)

ధ్వని—హిరణ్యకశిపా!

హిరణ్యకశిపుడు—అగు!

ధ్వని—నీవు మహాపురుషుడవు. జయించితివి!

హిరణ్యకశిపుడు—ధర్మమాచరించితిని.

ధ్వని—నీ సంకల్ప మీడేరినది.

హిరణ్యకశిపుడు—అగును! క్రాంతికి సంపూర్ణజయము కలిగినది.

ధ్వని—నీవు సార్థక జన్ముడవు!

హిరణ్యకశిపుడు—అవును, దైవమతమును మంటకలిపితిని.

(ధ్వని వికటాట్టహాస మొనరించును.)

హిరణ్యకశిపుడు—నవ్వేద వేల?

ధ్వని—మతములనెల్ల మటుమాయ మొనరించి సత్యసమ్మతమగు వేరొక మతమును సృష్టించితివి. హిరణ్యకశిపా! ఒక దైవమును రూపుమాపితివి. కాని మతమును మాత్రము నిర్మూలింప జాలవైతివి. మతానుసారిత దైవములు ఎప్పుడూ నిత్యములే.

హిరణ్యకశిపుడు—సత్యమే! అయిన నేమి, క్రాంతి జయించినది గదా!

ధ్వని—క్రాంతిని కళ్యాణము వరించి తీరవలసినదే.

హిరణ్యకశిపుడు—క్రాంతికి జయము.

(దిగ్దిగంతముల క్రాంతికి జయమని ప్రతిధ్వనించును.)

తెర

క్రాంతికి జయమను శబ్దము మారుమ్రోగుచునే యుండును.

.....

86

Check List

Book Number	SymRV1C290	Date	20/8/22
Front Cover	yes	Back Cover	yes
Blank Pages	CT, 85		
Missing Pages	NO		
Prepared By	Sandhya	Cutting By	Sandhya
Scanned By	Lakshmi	Pages	89